




# హంస వాయిస్

మా అక్షరం... సామాన్యుడి గళం

ఆదివారం | 6-4-2025 | హైదరాబాద్ | epaper.hamsavoice.in | సంపుటి: 2 | సంచిక: 171 | పేజీలు 8+8 | వెల : 6.50

HYDERABAD I KARIMNAGAR I NIZAMABAD I NALGONDA I MAHABUBNAGAR I WARANGAL I KHAMMAM I KURNOOL I ANANTHAPURAM I VIJAYAWADA I AMARAVATHI I TIRUPATI I TADEPALLIGUDEM I VISHAKAPATNAM I KADAPA




## తమిళ జాలర్లు, బోట్లను విడిచిపెట్టండి

శ్రీలంకను కోరిన ప్రధాని మోదీ
శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకే, ప్రధాని మోదీ మధ్య ద్వైపాక్షిక చర్చలు 2

## వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనే 'జమిలి'?..



2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో దాదాపు రూ.లక్ష కోట్లు ఖర్చు
జమిలి ఎన్నికలతో ఈ భారీ వ్యయం ఆదా
కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2

## మావోయిస్టులు ఆయుధాలు వీడండి

ఈ ఏడాది తొలి మూడు నెలల్లోనే 521 మంది ఆయుధాలు విడిచి జనజీవన స్రవంతి
కేంద్ర హోంమంత్రి అమిత్ షా



2

### కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత చెప్పినా..

# అవి మోదీ బియ్యమే

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



**హంస వాయిస్, హైదరాబాద్:**

రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తోన్న బియ్యానికి కేంద్ర ప్రభుత్వం డబ్బులు ఇస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రధాని మోదీ ఫొటో ఉన్న ఫ్లెక్సీలు పెడితే చింపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత చెప్పినా.. అవి మోదీ బియ్యమే అని అన్నారు.

''ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేటలో భాజపా కార్యకర్తలు ప్రధాని మోదీ ఫొటోతో ఉన్న ఫ్లెక్సీ పెడితే.. పోలీసుల సాయంతో చింపేయిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఫొటో పెట్టుకోండి.. మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ, ప్రధాని ఫొటో పెట్టండి. ఎందుకంటే బియ్యానికి డబ్బులిచ్చేది కేంద్రమే కాబట్టి. కాంగ్రెస్ ప్రభుత్వం కాస్త విజ్ఞతతో వ్యవహరించాలి. బియ్యం విషయంలో రాష్ట్రం వాటా ఏమైనా ఉంటే చెప్పండి. మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. భారాస అధికారంలో ఉన్నప్పటినుంచీ లబ్ధిదారులకు సన్నబియ్యం ఇవ్వాలని భాజపా డిమాండ్ చేస్తూనే ఉంది. ఇన్నేళ్లకు ఇప్పుడు సన్నబియ్యం ఇవ్వడం మొదలుపెట్టారు'' అని బండి సంజయ్ అన్నారు.

### ఏఐ ఫేక్ వీడియోలతో

# గందరగోళం సృష్టించారు



### కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. వివాదాస్పదమైన కంచ గచ్చిబౌలి భూముల కేసు.. సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

**హంస వాయిస్, హైదరాబాద్:**

వివాదాస్పదమైన హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల కేసులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం తదుపరి కార్యాచరణపై అధికారులను ఆదేశించారు. చెట్లను నరికివేయడంతో అక్కడి వన్యప్రాణులు చెల్లాచెదురయ్యాయంటూ కొందరు ఏఐ వీడియోలు సృష్టించడాన్ని సీఎం తీవ్రంగా పరిగణించారు. దీనిపై విచారణకు ఆదేశించేలా కోర్టును కోరాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కంచ గచ్చిబౌలి భూముల్లో 25ఏళ్లలో ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారని, ఎన్నడూ వన్యప్రాణులు, పర్యావరణానికి సంబంధించిన వివాదాలు రాలేదని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఏఐ ఫేక్ వీడియోలతో గందరగోళం సృష్టించారని వివరించారు. ఇలాంటి ఘటనలు (మిగతా 2లో)



### వక్ఫ్ (సవరణ) బిల్లు2025కు రాష్ట్రపతి ఆమోదం

దిల్లీ: వక్ఫ్ (సవరణ) బిల్లు2025కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. దీంతో వక్ఫ్ (సవరణ) బిల్లు చట్టంగా మారింది. ఇటీవల ఈ బిల్లుకు ఉభయ సభలు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. వక్ఫ్ బిల్లుపై బుధవారం లోక్‌సభలో 14 గంటలకు పైగా చర్చ జరిగింది. అనంతరం సవరణల వారీగా ఓటింగ్ ప్రక్రియ నిర్వహించగా.. బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటేశారు. రాజ్యసభలో బిల్లుకు అనుకూలంగా 128 మంది, వ్యతిరేకంగా 95 మంది సభ్యులు ఓటేశారు. ప్రతిపక్షాలు ప్రతిపాదించిన సవరణలు వీగిపోయాయి. వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ముస్లింలకు వ్యతిరేకం కాదని, ఏ ఒక్కరి మత విశ్వాసాలను దెబ్బతీయటం ప్రభుత్వం ఉద్దేశం కాదని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు.

# రైతులను వ్యాపారవేత్తలుగా మారుస్తాం

2

### వివిధ దేశాల ఉత్పత్తులపై సుంకాలను విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం ఒక రకంగా మనకు మేలే



గ్లోబల్ ఇండియా బిజినెస్ ఫోరం(జీఐబీఎఫ్) ఆధ్వర్యంలో పార్క్ హయత్‌లో నిర్వహించిన ''ఇండియా లాటిన్ అమెరికా, కరీబియన్ కంట్రీస్ బిజినెస్ కాంక్లేవ్'' రెండో ఎడిషన్‌కు ముఖ్య అతిథిగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

# యువతులతో డ్రగ్స్ డెలివరీ..

### ముఠా వివరాలు వెల్లడించిన సందీప్ శాండిల్య



**హైదరాబాద్:** విదేశాలకు అక్రమంగా డబ్బును బదిలీ చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. డ్రగ్స్ విక్రయం ద్వారా వచ్చిన డబ్బును ఈ ముఠా విదేశాలకు తరలిస్తోంది. ఈ ఘటనలో ముగ్గురు నైజీరియన్లను తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ (మిగతా 2లో)

## లొంగిపోయిన 86 మంది మావోయిస్టులు

**కొత్తగూడెం:** పెద్ద సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. భద్రాద్రి కొత్తగూడెం పోలీసుల ఎదుట 86 మంది మావోయిస్టులు లొంగిపోయారు. పోలీసు బెటాలియన్ కార్యాలయంలో కొత్తగూడెం మల్టీ జోన్1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో వీరంతా లొంగిపోయారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. లొంగిపోయిన మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందినవారని తెలిపారు. వీరిలో 66 మంది పురుషులు, 20 మంది మహిళా మావోయిస్టులు ఉన్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న 'ఆపరేషన్ చేయూత' కార్యక్రమంలో భాగంగా వీరంతా లొంగిపోయినట్లు ఐజీ పేర్కొన్నారు. లొంగిపోయిన వారికి తక్షణ సాయం కింద రూ. 25 వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

### హెచ్‌సీయూ ఉదంతాన్ని ప్రభుత్వం

# గుణపాఠంగా తీసుకోవాలి

### భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్

**హైదరాబాద్:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి సరైంది కాదని భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ విద్యార్థులు, వారికి అండగా నిలిచిన పార్టీలకు కేసీఆర్ అభినందనలు తెలిపారు. హెచ్‌సీయూ ఉదంతాన్ని ప్రభుత్వం గుణపాఠంగా తీసుకోవాలన్నారు. ''భారాస ప్రభుత్వం తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టింది. రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దితే నిలబెట్టుకోవడం ఈ ప్రభుత్వానికి చేతకాలేదు. ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక ప్రతిష్ఠను ఈ ప్రభుత్వం దిగజార్చింది. హెచ్‌సీయూ విషయంలో మరోసారి రాష్ట్ర ప్రతిష్ఠను దిగజార్చేలా చేశారు'' అని కేసీఆర్ విమర్శించారు.






### ట్రంప్ చర్యలతో యూఎస్‌లో

# ఉద్యోగాలుండవ్

ప్రముఖ బహుళజాతి ఆర్థిక సేవల సంస్థ జేపీ మోర్గాన్ 2

### పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల


# త్వరగా పూర్తి చేయండి

### మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

**హైదరాబాద్:** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మొదటి దశను డిసెంబరు లోపలే పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. నీటిపారుదలశాఖ అధికారులతో ఉత్తమ్‌కుమార్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. నార్లాపూర్, ఏదుల జలాశయాల మధ్య రెండో ప్యాకేజీని త్వరగా పూర్తి చేస్తామని ఉత్తమ్ తెలిపారు. కాలువల పనులను (మిగతా 2లో)



## విద్యుత్‌దీప కాంతుల్లో భద్రాద్రి సీతారాముల ఆలయం



శ్రీరామనవమి ఉత్సవాలకు భద్రాచలం సుందరంగా ముస్తాబైంది. విద్యుత్‌దీప కాంతుల్లో శ్రీ సీతారాముల ఆలయం వెలుగులు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. శ్రీరామనవమి ఉత్సవాలకు భద్రాచలం సుందరంగా ముస్తాబైంది. విద్యుత్‌దీప కాంతుల్లో శ్రీ సీతారాముల ఆలయం వెలుగులు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. శ్రీరామనవమి సందర్భంగా ఆలయానికి భక్తులు భారీగా తరలి వస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు, పోలీసులు అన్ని చర్యలు చేపట్టారు. సీతారాముల ఆలయం డ్రోన్ దృశ్యాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి.

## యువతులతో డ్రగ్స్ డెలివరీ..



సందీప్ శాండిల్య వెల్లడించారు. గత 3 నెలలకు పైగా ఈ ముఠాపై నిఘా పెట్టినట్లు చెప్పారు. డ్రగ్స్ తీసుకున్నాక నగదు చెల్లింపులు జరుపుతున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. వీటిని డెలివరీ చేసేందుకు అమ్మాయిలను ఉపయోగిస్తున్నట్లు దర్యాప్తులో తెలిసిందని పేర్కొన్నారు. టోలీచౌకి ప్రాంతంలో డ్రగ్స్ డెలివరీ చేసిన యువతిని అదుపులోకి తీసుకొని విచారణ చేసినట్లు వివరించారు. ముఠా సభ్యులు ఆ యువతికి రూ.50 వేలు ఇచ్చినట్లు చెప్పారు.

"గత 5 సంవత్సరాలుగా డ్రగ్స్ ద్వారా నైజీరియాకు వెళ్లిన డబ్బుల వివరాలు సేకరించాం. భారత్‌తో పాటు అమెరికాలో నైజీరియన్లు డ్రగ్స్ సప్లై చేస్తున్నారు. డ్రగ్స్ కావాలని కస్టమర్లు డబ్బులు చెల్లించే లావాదేవీల ద్వారా నిందితులను పట్టుకున్నాం. కస్టమర్లు డబ్బులు చెల్లించేందుకు 15 మంది యువతుల బ్యాంక్ ఖాతాలు ఇచ్చారు. 5 సంవత్సరాల్లో డ్రగ్స్ కోసం భారత్‌అమెరికానైజీరియన్ల మధ్య కోట్ల రూపాయలు లావాదేవీలు జరిగినట్లు తేల్చాం. అమెరికా నుంచి డబ్బులు నేరుగా నైజీరియాకు వెళ్లకుండా.. మొదట భారత్‌కు పంపిస్తారు. ఇక్కడి నుంచి హవాలా మార్గంలో నైజీరియాకు తీసుకెళ్తారు. డ్రగ్స్ మొత్తం విదేశాల్లోనే తయారు అవుతున్నాయి. మన దేశంలో చాలా తక్కువ తయారవుతున్నట్లు గుర్తించాం. ఫారెక్స్ ఏజెంట్ల సహకారంతో నైజీరియన్లు డబ్బులను విదేశాలకు తరలిస్తున్నారు." అని సందీప్ శాండిల్య చెప్పారు.

# తమిళ జాలర్లు, బోట్లను విడిచిపెట్టండి

శ్రీలంక పర్యటనలో ఉన్న ప్రధాని మోదీతమిళ జాలర్ల సమస్యను లేవనెత్తారు. ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే వద్ద ఈ అంశాన్ని ప్రస్తావించారు. తమిళ జాలర్లను వెంటనే విడుదల చేయాలని, వారి పడవలను విడిచిపెట్టాలని కోరారు. రెండు దేశాల మధ్య ఎన్నో ఏళ్లుగా ఈ అంశం నలుగుతోంది. దానికి పరిష్కారం చూపే దిశగా తాజా పర్యటనలో చర్చలు జరిగాయి.

మత్స్యకారుల సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత కేంద్ర ప్రభుత్వానికే ఉందని ఇప్పటికే తమిళనాడు ప్రభుత్వం పలుమార్లు వెల్లడించింది. మోదీ శ్రీలంక పర్యటన నేపథ్యంలో ఇటీవల దీనిపై అభ్యర్థనలు చేసిన సంగతి తెలిసిందే. కచ్చతీవు వద్ద రాష్ట్ర జాలర్లు చేపలు పట్టేందుకు అనుమతించేలా చర్యలు తీసుకోవాలని తమిళనాడు సీఎం స్టాలిన్ తెలిపారు. తమ రాష్ట్ర మత్స్యకారులను భారతీయ జాలర్లుగా కేంద్రం చూడాలన్నారు. కచ్చతీవులో చేపలు పట్టడానికి వీలుగా శ్రీలంకతో కొత్త ఒప్పందం అవసరమన్నారు. 2010 తర్వాత శ్రీలంక భారత్ మధ్య జాలర్ల అంశంపై చర్చలు జరపలేదన్నారు. ఈ క్రమంలోనే తాజాగా మోదీ దీనిపై అభ్యర్థన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**మయన్మార్‌కు క్వాడ్ దేశాలు ఆపన్నహస్తం**

**ప్రధాని మోదీకి 'శ్రీలంక మిత్ర విభూషణ'..**



ప్రధాని మోదీకి శ్రీలంక ప్రభుత్వం అత్యున్నత పురస్కారాన్ని ప్రదానం చేసింది. ద్వీపదేశ అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే 'శ్రీలంక మిత్ర విభూషణ' పురస్కారాన్ని అందజేశారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని ఆ దేశంలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. థాయ్‌లాండ్‌లో బిమ్‌స్టెక్ సదస్సు ముగిసిన అనంతరం శుక్రవారం సాయంత్రం ప్రధాని మోదీ నేరుగా అక్కడకు చేరుకున్నారు. బండారునాయకే ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో దిగిన ఆయనను లంక ప్రభుత్వం ఘనంగా స్వాగతించింది. శనివారం ఉదయం ఇండిపెండెన్స్ స్క్వేర్ వద్ద అధ్యక్షుడు సంప్రదాయ పద్ధతుల్లో ఆహ్వానం పలికారు. ఇరుదేశాల మధ్య ఉన్న చరిత్రాత్మక సంబంధాలకు ప్రతీకగా ఈ స్వాగతం నిలిచింది. ఇక రెండు దేశాల మధ్య కీలక రక్షణ ఒప్పందం కుదిరింది. ఈ మేరకు సంతకాలు జరిగాయి. ట్రింకోమలీని ఇంధన కేంద్రంగా అభివృద్ధి చేయడం, శ్రీలంక తూర్పు ప్రాంతానికి భారత్ గ్రాంట్ అందించడం వంటి ఒప్పందాలు జరిగాయి. అలాగే ఇద్దరు నేతలు సాంపూర్ సౌర విద్యుత్ ప్రాజెక్టును వర్చువల్‌గా ప్రారంభించారు. ద్వైపాక్షిక చర్చల అనంతరం మోదీ మాట్లాడుతూ.. "2019లో జరిగిన ఉగ్రదాడి, కొవిడ్ మహమ్మారి, ఇటీవలి ఆర్థిక సంక్షోభం.. ఎలాంటి క్లిష్టసమయంలో అయినా భారత్ శ్రీలంక వెంట ఉంది. రెండు దేశాల భద్రతా ప్రయోజనాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. ఈ దిశగా జరిగిన రక్షణ సహకారం ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. మత్స్యకారుల సమస్యపై మానవతా దృక్పథంతో వ్యవహరించాలని అంగీకారానికి వచ్చాం. శ్రీలంక ప్రభుత్వం తమిళ ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుందని ఆశిస్తున్నాం. భారత ప్రయోజనాల విషయంలో అధ్యక్షుడు సానుకూలంగా స్పందిస్తున్నందుకు కృతజ్ఞతలు" అని తెలిపారు. భారత ప్రయోజనాలకు విరుద్ధంగా శ్రీలంక భూభాగాన్ని వినియోగించనివ్వబోమని ఆ దేశాధ్యక్షుడు వెల్లడించారు. క్లిష్ట సమయాల్లో న్యూఢిల్లీ అందిస్తోన్న సహకారం ఎంతో విలువైనది అని పేర్కొన్నారు.

## వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనే 'జమిలి'?..



జమిలి ఎన్నికలకుసంబంధించి జరుగుతున్న ఓ ప్రచారాన్ని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల సమయంలో వీటిని అమలు చేసే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. చెన్నైలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో దాదాపు రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారని, జమిలి ఎన్నికలతో ఈ భారీ వ్యయం ఆదా అవుతుందన్నారు.

**2034 తర్వాతే..**

"పార్లమెంటు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే.. దేశ జీడీపీలో 1.5శాతం పెరుగుదల కనిపిస్తుంది. విలువ పరంగా చూస్తే.. ఆర్థిక వ్యవస్థకు రూ.4.5లక్షల కోట్లు చేకూరుతాయి. జమిలి ఎన్నికల వల్ల కలిగే ప్రయోజనానికి ఇదో ఉదాహరణ" అని కేంద్ర మంత్రి చెప్పారు. కొన్ని పార్టీలు దీనిపై అసత్య ప్రచారాలు చేస్తూ.. గుడ్డిగా వ్యతిరేకిస్తున్నాయని విమర్శించారు. 2034 తర్వాతే ఇవి అమలు అవుతాయని, ఇప్పుడు వాటికి పునాది మాత్రమే పడిందన్నారు.

**ఎప్పటి నుంచో...**

"ఈ విధానంపై గతంలో అనేకసార్లు చర్చలు జరిగాయి. కేవలం నరేంద్ర మోదీ మాత్రమే దీన్ని తీసుకురాలేదు. 1960 నుంచి ఇది ఉనికిలో ఉంది. దీన్ని గుడ్డిగా వ్యతిరేకించే బదులు.. దాని ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకొని మద్దతిస్తే దేశం మరింత పురోగతి సాధిస్తుంది" అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. డీఎంకే దివంగత నేత కరుణానిధి కూడా దీనికి మద్దతిచ్చారని.. కానీ, ఆయన కుమారుడు, ప్రస్తుత సీఎం (ఎంకే స్టాలిన్) మాత్రం దీన్ని వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ఇది ఏ ఒక్కరి ప్రాధాన్య ప్రాజెక్టు కాదని, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిందని స్పష్టం చేశారు.

# రైతులను వ్యాపారవేత్తలుగా మారుస్తాం

**హైదరాబాద్:** పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అనుకూలతలను వివరించి, ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాల అధికార ప్రతినిధులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కోరారు. గ్లోబల్ ఇండియా బిజినెస్ ఫోరం (జీఐబీఎఫ్) ఆధ్వర్యంలో పార్క్ హయత్‌లో నిర్వహించిన "ఇండియా లాటిన్ అమెరికా, కరీబియన్ కంట్రీస్ బిజినెస్ కాంక్లేవ్" రెండో ఎడిషన్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలు, ప్రభుత్వం తరపున పారిశ్రామికవేత్తలకు అందించే ప్రోత్సాహకాలను వివరించారు.

వివిధ దేశాల ఉత్పత్తులపై సుంకాలను విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం ఒక రకంగా మనకు మేలే చేస్తుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలు భారత్ వైపే చూస్తున్నారన్నారు. ఈ పరిణామాన్ని అనుకూలంగా మార్చుకుని ఎక్కువ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. తెలంగాణ ఎంఎస్‌ఎంఈలు ప్రపంచవ్యాప్తంగా సత్తా చాటేలా ప్రత్యేక పాలసీని తీసుకొచ్చామన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. జహీరాబాద్ నిమ్జ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు 6 అంతర్జాతీయ స్థాయి సంస్థలు ముందుకొచ్చాయని, వీటిలో మూడు కొరియా కంపెనీలున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేసేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఆగ్రో ప్రాసెసింగ్ రంగాన్ని ప్రోత్సహించి అన్నదాతలను వ్యాపారవేత్తలుగా తీర్చి దిద్దుతామని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

### పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల

## త్వరగా పూర్తి చేయండి



**(మొదటి పేజీ తరువాయి)**

తక్షణమే చేపట్టి అక్టోబర్ వరకు పూర్తి చేస్తామన్నారు.

"నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెణ జలాశయాల పనులన్నీ పూర్తి చేస్తాం. డిసెంబర్ వరకు పనులు పూర్తి చేసి 50 టీఎంసీలు నిల్వ చేస్తాం. సబ్ స్టేషన్ల పనుల కోసం ట్రాన్స్‌కోకు రూ.262 కోట్లు విడుదల చేశాం. జులై నెలలో పంపుల డ్రై రన్ చేపడతాం. జూరాల ప్రాజెక్టులో పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించాం" అని ఉత్తమ్ తెలిపారు.

### ఏఐ ఫేక్ వీడియోలతో

## గందరగోళం సృష్టించారు



**(మొదటి పేజీ తరువాయి)**

పునరావృతం కాకుండా చూడాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో సైబర్ క్రైమ్ విభాగాన్ని బలోపేతం చేయాలన్నారు. ఏఐ ఫేక్ కంటెంట్‌ను పసిగట్టే ఫోరెన్సిక్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌టూల్‌స్‌ను సమకూర్చుకోవాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ శాంతికుమారి, టీజీఐఐసీ ఎండీ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.



## మావోయిస్టులు ఆయుధాలు వీడండి


మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడలో పర్యటిస్తున్న ఆయన.. రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన బస్తర్ పణ్‌డూమ్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్తర్ గిరిజనుల అభివృద్ధిని మావోలు ఆపలేరన్నారు. మార్చి 2026 నాటికి నక్సల్ సమస్య అంతమవుతుందని అమిత్ షా ఉద్ఘాటించారు. "బస్తర్‌లో బుల్లెట్ కాల్పులు, బాంబు పేలుళ్ల రోజులు ముగిశాయి. ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని మావోయిస్టు సోదరులకు విజ్ఞప్తి చేస్తున్నా. మీరు కూడా మాలో భాగమే. ఏ మావోయిస్టు చనిపోయినా ఎవరిలోనూ సంతోషం లేదు. ఆయుధాలు అడ్డం పెట్టుకొని స్థానిక గిరిజనుల అభివృద్ధిని ఆపలేరు" అని అమిత్ షా పేర్కొన్నారు.

# ట్రంప్ చర్యలతో యూఎస్‌లో ఉద్యోగాలుండవ్

ట్రంప్ చర్యలతో ఈ ఏడాదిలోనే అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి ప్రవేశించే అవకాశం ఉందని ప్రముఖ బహుళజాతి ఆర్థిక సేవల సంస్థ జేపీ మోర్గాన్ అంచనా వేసింది. ఇంతకుముందు 40 శాతం ఉన్న ఈ అవకాశం ఇప్పుడు 60శాతానికి పెరిగినట్లు పేర్కొంది. అంతేకాకుండా దేశ స్థూల దేశీయోత్పత్తిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ప్రపంచ దేశాలపై యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న ప్రతీకార సుంకాలే దీనికి ప్రధాన కారణమని జేపీ మోర్గాన్ సీఈవో మైఖేల్ ఫెరోలి పేర్కొన్నారు. మాంద్యం వల్ల అమెరికాలో నిరుద్యోగ రేటు 5.3 శాతానికి పెరుగుతుందని.. దీని వల్ల అగ్రరాజ్యంలో ఉద్యోగాలుండవని పేర్కొన్నారు.

**అమెరికా మార్కెట్లు విలవిల**

ప్రపంచదేశాల నుంచి యూఎస్‌కు వచ్చే దిగుమతులు 20శాతం కంటే ఎక్కువగా తగ్గే అవకాశం ఉందని యూఎస్ ఆర్థికవేత్త జోనాథన్ పింగిల్ పేర్కొన్నారు. రాబోయే త్రైమాసికాలలో జీడీపీలో దిగుమతులు 1986కు ముందు స్థాయిలకు తిరిగి వెళ్లే అవకాశం ఉందన్నారు. అమెరికా నూతన సుంకాల విధానంపై ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ సైతం ఆందోళన వ్యక్తంచేశారు. ట్రంప్




యంత్రాంగం అమలుచేస్తున్న సుంకాలు దేశానికి గతంలో ఊహించిన దానికంటే చాలా ఎక్కువ ఆర్థిక నష్టాన్ని కలిగిస్తాయన్నారు. బార్క్లేస్, బోఫా గ్లోబల్ రీసెర్చ్, డ్యూష్ బ్యాంక్, యూబీఎస్ గ్లోబల్ వెల్త్ మేనేజ్‌మెంట్ వంటి ఇతర పరిశోధనా సంస్థలు సైతం అమెరికా విధిస్తున్న కొత్త టారిఫ్‌లు అమెరికా ఆర్థికవ్యవస్థను పతనం చేసే ప్రమాదం ఉందని హెచ్చరించాయి.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ సహా అన్ని ప్రపంచదేశాలపై సుంకాలతో విరుచుకుపడ్డారు. తమతో వాణిజ్య లావాదేవీలు ఉన్న దేశాలన్నింటిపైనా ఆయన టారిఫ్‌లు వేశారు. భారత్ 27శాతం, వియత్నాం 46 శాతం, ఇజ్రాయెల్ 17 శాతం సుంకాలు విధించారు. అన్ని దేశాల వారూ తమ ఉత్పత్తులను అమెరికా మార్కెట్లో విక్రయించుకోవచ్చని.. అయితే కనీసం 10% సుంకం చెల్లించాలని ఆయన స్పష్టంచేశారు. మొత్తం 27 శాతం టారిఫ్‌లో 10 శాతం సుంకం ఏప్రిల్ 5 నుంచి అమల్లోకి రానుండగా.. మిగతా 17 శాతం ఏప్రిల్ 10 నుంచి విధించనున్నట్లు తెలుస్తోంది. ట్రంప్ ప్రకటనతో స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. అమెరికా సహా అన్ని ప్రధాన మార్కెట్లు పతనమవుతున్నాయి.

**ట్రంప్ టారిఫ్‌ల ఎఫెక్ట్.. స్టోర్లకు పరిగెడుతున్న అమెరికన్లు**

ట్రంప్ సుంకాలతో అమెరికన్లు దుకాణాలకు క్యూ కడుతున్నారు. ధరలు పెరగకముందే వస్తువులను కొనుగోలు చేస్తున్నారు.

వాషింగ్టన్: చిన్నా, పెద్దా తేడా లేకుండా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాల మోత మోగించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే అధిక ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొంటున్న అగ్రరాజ్యంలో ఈ నిర్ణయంతో అనేక వస్తువుల ధరలు మరింత ప్రియం కానున్నాయి. దీంతో అమెరికన్లు స్టోర్లకు క్యూ కడుతున్నారు. ధరలు పెరగముందే వస్తువుల కొనుగోళ్లు చేపడుతున్నారు. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు గిరాకీ పెరిగింది.

తైవాన్‌పై ట్రంప్ 32శాతం సుంకాలు విధించడంతో ఆ దేశం నుంచి దిగుమతియ్యే ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి. దీంతో ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, కెమెరాలకు ప్రస్తుతం డిమాండ్ పెరిగింది. కార్లు, ఇతర గృహోపకరణాలకు కూడా పెద్దఎత్తున ఆర్డర్లు వస్తున్నాయని ఆయా కంపెనీలు చెబుతున్నాయి. "ఏడాది కాలంగా కొత్త ల్యాప్‌టాప్ కొనాలని చూశా. తైవాన్ బ్రాండ్ కావాలని ఆశపడ్డా. ఇప్పుడు ధర పెరగనుండటంతో అధ్యక్షుడు సుంకాలు ప్రకటించిన రోజే ల్యాప్‌టాప్‌కు ఆర్డర్ పెట్టా" అని టెక్సాస్‌కు చెందిన యువకుడు జాన్ గుటిరెచ్ వెల్లడించారు.

**ఏం ఫర్వాలేదు.. సంపన్నులైపోతాం: మార్కెట్ పతనంపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు**

ఈ సుంకాల కారణంగా అమెరికాలో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరుగుతాయని ఇప్పటికే ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నాయి. ఇప్పటికే నిరుద్యోగ సమస్య, ద్రవ్యోల్బణం వల్ల కుదేలవుతున్న అగ్రరాజ్య ఆర్థిక వ్యవస్థకు ఇది మరింత విఘాతం కలిగించనుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాలు మాంద్యానికి దారితీయొచ్చని అనుమానిస్తున్నారు.

**మొదలైన సుంకాల వసూలు..**

ఇదిలాఉండగా.. ట్రంప్ ప్రకటించిన టారిఫ్‌లు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. అమెరికా కాలమానం ప్రకారం ఏప్రిల్ 5వ తేదీ ప్రారంభమయ్యే 12 గంటల నుంచి ఈ సుంకాల వసూలు ప్రారంభించారు. ప్రస్తుతం ఆయా దేశాలపై విధించిన టారిఫ్‌ల్లో బేస్‌లైన్ 10శాతాన్ని నేటినుంచి అమలుచేస్తున్నారు. మిగతా మొత్తాన్ని ఏప్రిల్ 10 నుంచి విధిస్తామని ఇప్పటికే అగ్రరాజ్య సర్కారు వెల్లడించింది. ఈక్రమంలోనే యూఎస్ సముద్ర పోర్టులు, ఎయిర్‌పోర్టులు, కస్టమ్స్ వేర్‌హౌస్‌ల వద్ద ఈ అర్ధరాత్రి నుంచి (అమెరికా కాలమానం ప్రకారం) దిగుమతులపై సుంకాల వసూలు చేపట్టినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. అయితే, యూఎస్ కస్టమ్స్, బోర్డర్ ప్రొటెక్షన్ బులిటెన్ ప్రకారం.. కొన్ని దిగుమతులకు 51 గ్రేస్ పీరియడ్ వర్తించనుంది. టారిఫ్‌ల అమలు సమయానికి ముందే నౌకలు, విమానాల్లో లోడ్ అయి, రవాణా మధ్యలో ఉన్న కార్గోలకు ఈ మినహాయింపు కల్పించారు. అయితే ఈ కార్గోలన్నీ మే 27లోగా అమెరికాకు వస్తే 10శాతం సుంకం వర్తించదని అధికారులు వెల్లడించారు.



## పర్యావరణాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పోరాటం: మీనాక్షి నటరాజన్

**హైదరాబాద్:** పర్యావరణాన్ని కాపాడటానికి కాంగ్రెస్ పోరాటం చేస్తోందని తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైన నేపథ్యంలో ఆమె స్పందించారు. ఈ వ్యవహారంపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ కమిటీతో అన్ని అంశాలు చర్చిస్తున్నట్లు చెప్పారు. "ఏకపక్షంగా అందరివాదనలు వింటాం. ఏం చేయాలో తర్వాత నిర్ణయిస్తాం. ఎవరికీ నష్టం జరగకుండా వివాదం పరిష్కరించాలనేది మా ఆలోచన. విద్యార్థుల లేఖలపై సమాచారం సేకరిస్తాం. ప్రతిపక్షాల ఆరోపణలపై వాస్తవాలను ప్రజలకు వివరిస్తాం" అని మీనాక్షి నటరాజన్ తెలిపారు.

## రాజాసింగ్‌పై త్వరలో సస్పెన్షన్ వేటు!

**రాష్ట్ర నేతలపై వరుస వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో..**
**క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కమిటీ ఫైల్ సిద్ధం!**
**రెండు రోజుల్లో హైకమాండ్‌కు నివేదిక పంపేలా ఏర్పాట్లు**



**హైదరాబాద్:** బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై క్రమశిక్షణ చర్యలకు రంగం సిద్ధమైందా? రాష్ట్ర నేతలపై వరుస వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై చర్యలకు రాష్ట్ర కమిటీ ఫైల్ సిద్ధం చేసిందా? ఆ ఫైల్‌ను రెండ్రోజుల్లో హైకమాండ్‌కు పంపనున్నదా? అంటే బీజేపీ వర్గాల నుంచి అవుననే సమాధానాలే వస్తున్నాయి. ఎమ్మెల్యే రాజాసింగ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై వరుసగా చేస్తున్న వ్యాఖ్యలు ఆ పార్టీలో అగ్గి రాజేస్తున్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని రాష్ట్ర కమిటీ నియమిస్తే రబ్బర్ స్టాంప్‌గానే మిగిలిపోతాడని, గతంలో ఉన్న అధ్యక్షుడు గ్రూప్‌లు కట్టారని, రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆ ముఖ్యమంత్రిని కొందరు బీజేపీ ముఖ్య నేతలు రహస్యంగా కలుస్తారని రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

తాజాగా హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గౌతమ్‌రావును ప్రకటించడంపై రాజాసింగ్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఉద్దేశించి పరోక్షంగా గులాంగిరి చేసేవారికే పోస్టులు, టికెట్లు ఇస్తారా? అని ప్రశ్నించారు. వరుసగా పార్టీ ప్రతిష్టను దిగజార్చేలా మాట్లాడుతున్న రాజాసింగ్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పార్టీ శ్రేణుల్లో తప్పుడు సంకేతాలు వెళ్తాయని రాష్ట్ర నాయకత్వం భావించి ఫైల్ సిద్ధం చేసినట్టు సమాచారం. మరో రెండ్రోజుల్లో ఈ ఫైల్‌ను హైకమాండ్‌కు పంపనున్నట్టు, వారం రోజుల్లో సస్పెన్షన్ వేటు ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్టు బీజేపీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

## 'పాలమూరు' పనులకు పచ్చజెండా

**ఎట్టకేలకు రాష్ట్ర సర్కారులో కదలిక**
**సాగునీటి మంత్రి ఉత్తమ్ సమీక్ష**
**ప్యాకేజీ 3 కెనాల్ పనులతోపాటు రిజర్వాయర్లు పూర్తికి ఆదేశం**



**హైదరాబాద్:** ఎట్టకేలకు కాంగ్రెస్ సర్కారులో కదలిక వచ్చింది. 'నమస్తే తెలంగాణ' కథనంతో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల సాగునీటి పథకం (పీఆర్ఎల్ఐఎస్) పనులను చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్యాకేజీ 3 పనులతోపాటు రిజర్వాయర్లను పూర్తిచేయాలని అధికారులకు తాజాగా ఆదేశాలు జారీచేసింది. పీఆర్ఎల్ఐఎస్ పనులను కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వమే దాదాపు పూర్తిచేసింది. రిజర్వాయర్లు, పంప్‌హౌజ్‌ల నిర్మాణం పూర్తయింది. కల్వకుర్తి ఆయకట్టుకు సైతం ప్రాజెక్టును అనుసంధానం చేసింది. నార్లాపూర్‌లో ఎత్తిపోతలను కూడా ప్రారంభించింది. ప్యాకేజీ 3లో అంటే అంజనగిరి (నార్లాపూర్) రిజర్వాయర్ నుంచి వీరాంజనేయ (ఏదుల) రిజర్వాయర్ వరకు జలాలను తరలించే కెనాల్ పనులు కొద్దిగా మాత్రమే మిగిలి ఉన్నాయి. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ సర్కారు ఆయా పనులను అసలే పక్కకు పెట్టింది. ఇతర కాల్వల టెండర్లను సైతం రద్దుచేసింది. ఈ నేపథ్యంలోనే 'పాలమూరుపై పగ.. కల్వకుర్తి దగా' పేరిట ఇటీవల నమస్తే తెలంగాణ ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీంతో ప్రభుత్వం ఎట్టకేలకు స్పందించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సెక్రటేరియట్‌లో శనివారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఆ శాఖలోని ఇతర సీనియర్ అధికారులతో చర్చించారు. పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు.

## జగ్జీవన్ రామ్‌కు భారతరత్న ఇవ్వాలి

**తెలంగాణ భవన్‌లో ఘనంగా జయంత్యుత్సవాలు**

**హైదరాబాద్:** దివంగత ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలని మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణభవన్‌లో జగ్జీవన్‌రామ్ జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మధుసూదనాచారితో పాటు బీఆర్ఎస్ నాయకులు పెద్దసంఖ్యలో హాజరై ఆ మహనీయుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ పీడిత వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని ధారపోసిన గొప్పవ్యక్తి జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. రక్షణ మంత్రిగా పాకిస్థాన్ కబంధ హస్తాల నుంచి బంగ్లాదేశ్‌ను విముక్తి చేయడంలో కీలకభూమిక పోషించారని ప్రశంసించారు.

# కాసుల కోసం కక్కుర్తి!

**నకిలీ బిల్లులతో సీఎంఆర్ఎఫ్ నిధులు పక్కదారి**



**వరంగల్ :** వారికి ఏ వ్యాధీ ఉండదు. ఆసుపత్రుల్లోనూ చేరరు. అయినా ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్నట్లు.. ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుని రూ.లక్షల్లో ఖర్చు చేసినట్లు నకిలీ బిల్లులు సృష్టిస్తారు. వాటితో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్)కి దరఖాస్తు చేసి రూ.లక్షల్లో ప్రజాధనాన్ని పక్కదారి పట్టిస్తారు. తాజాగా హనుమకొండ సుబేదారిలోని రోహిణి ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు కొందరు అక్రమార్కులు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసినట్లు గుర్తించిన అధికారులు ఆ ఆసుపత్రిని బ్లాక్ లిస్టులో పెట్టారు.

**సీఐడీ విచారణ**

గత ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా పలు ఆసుపత్రులు నకిలీ బిల్లులు సృష్టించి సీఎంఆర్ఎఫ్ నిధులు కొట్టేశారనే ఆరోపణలపై ఏడాది కిందట సీఐడీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం అలా నిధులను దుర్వినియోగం చేసిన 28 ఆసుపత్రులను గుర్తించి వాటిని బ్లాక్ లిస్టులో చేర్చారు. అందులో మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో ఒక్కో ఆసుపత్రితో పాటు హనుమకొండ జిల్లాలో రోహిణి ఆసుపత్రిపైనా కేసు నమోదు చేశారు. వాటిని బ్లాక్ లిస్టులో పెట్టారని తెలియకపోవడంతో కొంత మంది బాధితులు అక్కడ చికిత్స పొంది సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయడంతో అవి తిరస్కారానికి గురవుతున్నాయి.

**మరికొన్నింటిలోనూ..**

ఉమ్మడి జిల్లాలో ఓ మోస్తారు ఆసుపత్రులే 1500 వరకు ఉన్నాయి. చిన్నా చితక క్లినిక్‌లు వీటికి అదనం. ఇందులో త్రినగరిలోనే 800 వరకు ఉంటాయి. ఇందులో 45 ఆసుపత్రుల్లో మాత్రమే ఆరోగ్య శ్రీ ద్వారా బాధితులకు చికిత్స అందిస్తున్నారు. మిగిలినవి నగదు సహిత చికిత్సలే చేస్తున్నాయి. కొన్ని ఆసుపత్రుల్లోని ఆపరేటర్లు, ప్రజాప్రతినిధుల వద్ద పనిచేస్తున్న పీఏలతో కుమ్మక్కై వారికి (ప్రజాప్రతినిధులు) తెలియకుండానే సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసి నిధులు కాజేస్తున్నారు. కొన్నింటిలో ఆసుపత్రి యజమాన్యమే నేరుగా అక్రమాల్లో భాగస్వామ్యం అవుతోంది. నగరంలో సుమారు పది ఆసుపత్రిల్లో ఈ విధమైన నిధుల గోల్‌మాల్ జరుగుతోందని గతంలో జరిగిన సీఐడీ అధికారుల విచారణ సందర్భంగా దృష్టికి వచ్చిందని.. త్వరలోనే వాటిపైనా క్రిమినల్ చర్యలు తీసుకోవచ్చని సమాచారం.

**ప్రస్తుతం పకడ్బందీగా..**

సీఎంఆర్ఎఫ్ ద్వారా నిధులు పక్కదారి పడుతున్నాయని ప్రభుత్వానికి వివిధ మార్గాల ద్వారా ఫిర్యాదులు రావడంతో తాజాగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో మాత్రమే సమర్పించాలని.. ఆఫ్‌లైన్‌లో ఇస్తే డబ్బులు రావని సర్కారు ఇటీవలే తేల్చిచెప్పింది. ఉదాహరణకు ఓ ఆసుపత్రిలో చికిత్స చేసుకున్న బాధితుడు అసలు బిల్లులతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే, అతడు ఎవరి సిఫార్సు నమోదు చేశారో సంబంధిత ప్రజాప్రతినిధి లాగిన్‌కు ఆ దరఖాస్తు వెళుతుంది. ప్రజాప్రతినిధి బాధితుడి దరఖాస్తుకు ఓకే చెబితేనే అది సీఎంఆర్ఎఫ్ విభాగానికి బదిలీ అవుతుంది. లేదంటే తిరస్కరణకు గురవుతుంది. ఈ వివాదం ఇలా ఉండగా.. సీఎంఆర్ఎఫ్ మోసానికి, తమ ఆసుపత్రికి ఎలాంటి సంబంధం లేదని రోహిణి ఆసుపత్రి పర్యవేక్షకుడు సుధాకర్‌రెడ్డి వెల్లడించారు.

# ప్రజలకు మంచి చేయాలన్న సోయి ప్రభుత్వానికి లేకపోవడం శోచనీయం : కేసీఆర్



ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన ఉద్యమ స్ఫూర్తి బీఆర్ఎస్ సొంతమని, దశాబ్దాలుగా పోరాటం చేసిన నిరాశ నిస్పృహల్లో కూరుకుపోయిన తెలంగాణ సమాజానికి స్వరాష్ట్ర చైతన్యాన్ని, స్ఫూర్తిని నింపామన్నారు. రాష్ట్ర సాధనకు శాంతియుత పంథాలో పోరాటాలు నడిపిన ఘన చరిత్ర బీఆర్ఎస్‌ది అని చెప్పారు. తొమ్మిదిన్నరేండ్లు జనరంజకంగా పాలించి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. వ్యవసాయంతో పాటు సబ్బండ వర్గాలకు చేసిన సేవ మహోన్నతమైందని.. ప్రజలే కేంద్రకంగా, అభ్యున్నతే ధ్యేయంగా పని చేయడం బీఆర్ఎస్ పార్టీకే సాధ్యమన్నారు. తాము ఏం కోల్పోయామో ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అర్థమైందని.. తెలంగాణ అంటే ఇతరులకు పొలిటికల్ గేమ్.. బీఆర్ఎస్‌కు మాత్రం ఒక టాస్క్ అన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, బీఆర్ఎస్ హయాంలో మండు వేసవిలోనూ చెరువులు, కుంటలు మత్తళ్లు దుంకాయని.. కాంగ్రెస్ పాలనలో జీవాలకు నీళ్లు దొరకని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. నీళ్లందక ఎండిన వరి పంటలను పశువుల మేతకు వదిలేస్తున్న దయనీయ స్థితిపై కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ అసమర్థత మూలంగానే రైతులకు ఈ దుస్థితి దాపురించిందని కేసీఆర్ వాపోయారు. పల్లె, పట్టణ ప్రగతితో దేశ రాష్ట్ర, గ్రామీణ ఆర్థిక ప్రగతికి పట్టుగొమ్మలుగా పరిఢవిల్లిన పల్లెలు.. నేడు కనీస ఆదరణ లేక కునారిల్లుతుండడంపై ఆవేదన చెందారు. ఇవాళ రాష్ట్రం ఎక్కడబోతే మాకేంది.. ప్రజలు ఏమైతే మాకేంది అన్న తీరున స్వార్థ రాజకీయ, అధికారమే పరమావధిగా కాంగ్రెస్ నాయకులు పని చేస్తున్నారన్నారు. ఇదే తెలంగాణ ప్రజల పాలిట శాపంగా మారిందని, కొత్త రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నడిపినప్పుడు అన్ని రంగాల్లో అంధకార పరిస్థితులు.. ముఖ్యంగా విద్యుత్ రంగం పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేదని.. కరెంటు తక్కువైతే ఇతర రాష్ట్రాల గిడ్ తీసుకునే పరిస్థితి ఉందన్నారు. అలాంటి పరిస్థితుల్లో పట్టుదలతో తొమ్మిదినెలల్లో నేషనల్ గ్రిడ్ నిర్మించుకొని.. రాష్ట్రాన్ని కరెంటు కష్టాల నుంచి గట్టెక్కించుకున్నామన్నారు. 24గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందుబాటులోకి తెచుకున్నామని గుర్తు చేశారు. ఇదంతా తెలంగాణ ప్రజలపట్ల ఉద్యమ పార్టీకి ఉన్న ప్రేమాభిమానంతోనే సాధ్యమన్నారు.

7మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యాన్ని 20వేల మెగావాట్లకు పెంచుకున్నామని, దీనికి తోడు బీఆర్ఎస్ ప్రభుత్వ కృషితో అందుబాటులోకి 2400 మెగావాట్ల విద్యుత్ వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు విద్యుత్‌ను ఎందుకు అందించలేకపోతుందో అర్థంకావడం లేదన్నారు. ఇది కేవలం అసమర్థతేనని తెలుస్తుందని.. తీసుకున్న ప్రతి నిర్ణయంతో ప్రజలతో చీత్కారాలకు గురవడమే కాకుండా ప్రజలకు మంచి చేయాలన్న సోయి ప్రభుత్వానికి లేకపోవడం శోచనీయమన్నారు. రైతుల పట్ల ప్రేమ, వ్యవసాయంపై అవగాహన ఉంటే పాలనా ప్రాధాన్యతలు అర్థమవుతాయన్నారు. యంత్రాంగంపై పట్టు సాధించి ప్రజా సంక్షేమంపై రాజీలేని పాలన అందించొచ్చన్నారు. సమావేశంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే విజయ్ భాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి, మర్రి జనార్ధన్ రెడ్డి, గువ్వల బాలరాజు, జైపాల్ యాదవ్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ ఆంజనేయ గౌడ్, హనుమంతు నాయుడు, గట్టు యాదవ్ పాల్గొన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి మాజీ మంత్రి పువ్వాడ అజయ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్ రెడ్డి, సండ్ర వెంకట వీరయ్య, బానోత్ మదన్ లాల్, బానోత్ హరిప్రియ నాయక్, రేగ కాంతారావు, మెచ్చా నాగేశ్వర్ రావు, వనం వెంకటేశ్వర రావు, లింగాల కమల్ రాజ్ హాజరయ్యారు. ఉమ్మడి నల్గొండ నుంచి ఎమ్మెల్యే జీ జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్ర కుమార్, నోముల భగత్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్ రెడ్డి, నల్లమోతు భాస్కర్ రావు, బొల్లం మల్లయ్య యాదవ్, బడుగుల లింగయ్య యాదవ్, పార్టీ సీనియర్ నేత విజయసింహా రెడ్డితో పాటు మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆశన్నగారి, పార్టీ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, పార్టీ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల వంశీధర్ రావు హాజరయ్యారు.

# సన్న బియ్యం.. తూకంలో వ్యత్యాసం

**సంచుల్లో తరుగుతో డీలర్ల ఆందోళన**



**పెద్దపల్లి:** సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ రేషన్ డీలర్లకు తలనొప్పిగా మారింది. సంచుల్లో తరుగు వస్తుండటంతో నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో సంచికి రెండు కిలోల వరకు తగ్గుతోంది. ఇప్పటివరకు దొడ్డు బియ్యం పంపిణీ చేయడంతో చాలా మంది వినియోగదారులు తీసుకెళ్లడానికి ఆసక్తి చూపక డీలర్ల వద్దనే ఉండిపోవడం, లేకుంటే డీలర్లకే విక్రయించడంతో సంచుల్లో తరుగు వచ్చినా భరించారు. ప్రస్తుతం సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో ప్రతి కార్డుదారుడూ తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో బస్తాల్లో తూకం వ్యత్యాసంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండటం లేదని డీలర్లు ఆవేదన చెందుతున్నారు. ధాన్యం మర పట్టిన తర్వాత బియ్యాన్ని సక్రమంగా తూకం వేయకపోవడంతో ఈ సమస్య నెలకొందని చెబుతున్నారు.

**ఒక్కో బస్తాకు రెండు కిలోల తేడా**

జిల్లాలో మొత్తం 413 రేషన్ దుకాణాల పరిధిలో 2,19,952 కార్డులుండగా 6,21,836 మంది సభ్యులుగా నమోదయ్యారు. జిల్లాకు ప్రతి నెలా 4,013.39 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. వాస్తవంగా ఒక్కో సంచి బరువు 50.500 కిలోలుండాలి. అయితే 48 కిలోలలోపే ఉంటోందని డీలర్లు పేర్కొంటున్నారు. ఒక్కో సంచికి రెండు కిలోల నష్టం వస్తోంది. అంటే ఒక డీలరుకు 100 సంచుల బియ్యం కేటాయిస్తే దాదాపు రెండు క్వింటాళ్లు తరుగు వస్తోంది. ఈ సమస్యపై డీలర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు.

**సరఫరా ఆలస్యమవుతుందని..**

జిల్లాలో పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పౌర సరఫరాల శాఖ గోదాములున్నాయి. డీలర్లకు కేటాయించిన బియ్యం బస్తాలను గోదాముల్లో తూకం వేయాల్సి ఉంటుంది. సరఫరాలో ఆలస్యం అవుతుందనే కారణంతో తూకం వేయకుండానే లారీల్లో నింపుతున్నారు. బస్తాలను తూకం వేస్తే వ్యత్యాసం వచ్చే అవకాశం లేదు. తమ కోటా ఆధారంగా బియ్యం తరలిస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంటోందని డీలర్లు ఆరోపిస్తున్నారు. దొడ్డు బియ్యం సంచులు నెలల తరబడి నిల్వ ఉండటంతో చిరిగి తూకంలో వ్యత్యాసం ఉండేది, సన్న బియ్యం ఇటీవల మర పట్టినవే కావడంతో వ్యత్యాసం వచ్చే అవకాశాలు లేవని అధికారులు చెబుతున్నారు. లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తుండటంతో పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ అధికారులు దుకాణాలపై ఆరా తీస్తున్నారు.

పెద్దపల్లి పట్టణంలోని ఓ రేషన్ దుకాణంలో బియ్యం బస్తాను తూకం వేశారు. సంచితో కలిసి 50.500 కిలోల బరువు ఉండటానికి బదులు 48.360 కిలోలు మాత్రమే ఉంది. అంటే 2.14 కిలోల బరువు తగ్గింది.

**ఫిర్యాదు చేస్తే విచారణ జరుపుతాం**

బియ్యం తూకంలో వ్యత్యాసం ఉండే అవకాశం చాలా తక్కువ. బస్తా కచ్చితంగా 50 కిలోల బరువు ఉంటుంది. అక్కడక్కడ తేడా ఉన్నట్లు చెబుతున్నారు. ఫిర్యాదు చేస్తే విచారణ జరిపిస్తాం.



# నికోబార్‌లో నమ్మకద్రోహం

సమాజాన్ని ప్రభావితం చేసే అంశాలపై బహిరంగ చర్చలలో ఏ పదమూ, 'జాతీయ మీడియా'లా భ్రమలు కల్పించదు, తప్పుదోవ పట్టించదు. జాతీయ మీడియాగా పరిగణన పొందుతున్న వార్తాపత్రికలు, మ్యాగజైన్లు, టీవీ ఛానెల్స్ ఆలోచనా రీతులు సంకుచిత పరిధిలోనే ఉండిపోతున్నాయి. సైద్ధాంతిక, పక్షపాత గంతలు కట్టుకుని వాస్తవాలను చూస్తున్నాయి. జాతీయ రాజధాని ప్రాంతం (నేషనల్ క్యాపిటల్ రీజియన్) నుంచి, తరచు ఎన్‌సిఆర్ నుంచి మాత్రమే మన సువిశాల భారతదేశ సంఘటనలు, పరిణామాలను అవి చూస్తున్నాయి. అధికార పీఠానికి అన్ని విధాల చేరువలో ఉండడం వాటిని ప్రలోభపరుస్తుంది, సంతృప్తి పరుస్తుంది. కనుకనే వార్తాపత్రికల సంపాదకీయ పుటలో కేంద్ర కేబినెట్ మంత్రుల వ్యాసాలు తరచు ప్రచురితమవుతుంటాయి. ఇక టెలివిజన్‌లో భారతావని విలక్షణ వైవిధ్యం భిన్న పార్టీలకు చెందిన రాజకీయ వేత్తల మధ్య అరుపులు, కేకల వ్యవహారానికి పరిమితమవుతోంది! ఈ కారణంగానే మన సువిశాల మాతృభూమి వేర్వేరు ప్రాంతాలలోని విభిన్న సామాజిక సముదాయాల జీవనస్థితిగతులపై నిశిత, సమగ్ర అధ్యయనాలకు సంబంధించిన కథనాలకు 'జాతీయ' వార్తాపత్రికలలో అల్ప ప్రాధాన్యం మాత్రమే లభిస్తుండగా, 'జాతీయ' టెలివిజన్‌లో అసలు ప్రస్తావనకే నోచుకోవడం లేదు! 'జాతీయ మీడియా'పై నా సంశయాలు సంవత్సరాలుగా పెరుగుతూనే ఉన్నాయి.

అవి సహేతుకమైనవని పెద్ద ఎత్తున వెల్లడవుతోన్న ఒక జాతీయ కళంకం గురించిన రెండు ప్రశస్త వ్యాస సంకలనాలు ధ్రువపరిచాయి. మరి ఎన్‌సిఆర్‌లోని ఏ టెలివిజన్ స్టూడియోలోను ఆ విషయమై ఎన్నడూ ఎలాంటి చర్చ కనీస మాత్రంగానైనా జరగలేదు. జరగగలదనే ఆశాభావానికి సైతం ఆస్కారం లేదు. నేను ప్రస్తావించిన లజ్జాకర విషయం గ్రేట్ నికోబార్ దీవిలో ప్రణాళికా బద్ధ విధ్వంసం. చెన్నై నుంచి వెలువడే ఫ్రంట్ లైన్ మ్యాగజైన్ (3 మార్చి, 2025 సంచిక), పంకజ్ సేఖ్సారియ సంకలనం చేసిన వ్యాస సంపుటంలో ఆ అంశంపై నిశిత, విపుల వ్యాసాలు ఉన్నాయి. పంకజ్ సంకలనం 'The Great Nicobar Betrayal' ఒక దుర్బల దీవిని ప్రభుత్వం బుద్ధిపూర్వకంగానే విపత్తులోకి నెట్టివేస్తోందని పేర్కొంది. పంకజ్ స్వయంగా అండమాన్ నికోబార్ దీవులలో పలు సంవత్సరాల పాటు పరిశోధన నిర్వహించారు. ఆయన సంకలనంలోని వ్యాస రచయితలకు కూడా ఆ దీవుల స్థితిగతుల గురించి పరిశోధనల రూపేణా ప్రత్యక్ష పరిజ్ఞానం ఉన్నది. కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న ప్రాజెక్టుతో గ్రేట్ నికోబార్ దీవికి అనేక ప్రమాదాలు పొంచి ఉన్నాయని ఆ వ్యాసాలు అన్నీ స్పష్టం చేశాయి ప్రస్తుతం ఆ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.80,000కోట్లు. ఇది ఇంకా తప్పకుండా పెరుగుతుందని నిశ్చితంగా చెప్పవచ్చు. ఈ దుర్బల దీవిలో ఒక నౌకాశ్రయం, ఒక అంతర్జాతీయ విమానాశ్రయం, భారత్ ప్రధాన భూభాగం నుంచి వలసవెళ్లే లక్షలాది ప్రజల ఆవాసానికిగాను ఒక పట్టణాన్ని ఆ ప్రాజెక్టులో భాగంగా నిర్మించనున్నారు. 910 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న గ్రేట్ నికోబార్ దీవి నికోబార్ దీవుల సముదాయంలో చాలా పెద్దది. 'అండమాన్, నికోబార్' అనే ద్వీప సముదాయంలో భాగంగా ఉన్న గ్రేట్ నికోబార్ భూకంపాలకు ఆస్కారమున్న ప్రాంతం. ఈ దీవిలో గత దశాబ్దంలో 400కు పైగా భూకంపాలు నమోదయ్యాయి. 2004లో గ్రేట్ నికోబార్ సునామీ తాకిడికి గురయింది. దీవి అంతా ధ్వంసమయింది.

ఆ దీవివాసులు అయిన ఆదివాసీలలో అనేక మంది సునామీలో కొట్టుకుపోయారు. మరెంతో మంది పూర్తిగా నిరాశ్రయులయ్యారు. ఆ సముద్ర ఉత్పాతం ఊహించని, ఆకస్మిక పరిణామం. అయితే ఇప్పుడు అమలవుతున్న కొత్త ప్రాజెక్టు ప్రభుత్వం ఒక విపుల ప్రణాళికతో ఆ దీవి ప్రాకృతిక, సాంస్కృతిక సమగ్రతపై సంకల్పించిన దాడి! అవును, అక్షరాలా దౌర్జన్యమే, సందేహం లేదు. నౌకాశ్రయ నిర్మాణంతో అరుదైన భారీ తాబేళ్ల ఆవాస ప్రదేశాలన్నీ ధ్వంసమవుతాయి. ఇంకా పర్యావరణానికి ఎనలేని నష్టం వాటిల్లుతుంది. నిర్మించనున్న పుర నివేశం (టౌన్‌షిప్)తో 130చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని కోటికి పైగా వృక్షాలు ఉన్న దట్టమైన అడవి అంతరించిపోతుంది. ఈ దీవి చాలా అరుదైన, స్థల విశిష్ట వృక్ష, కీటక, పక్షి, జంతు జాతులు, సరీసృపాలకు నెలవు. ఈ జీవ వైవిధ్యమంతా నాశనమై పోతుంది. ఇదంతా పర్యావరణ పరమైన హాని కాగా సామాజిక మూల్యాలు అంతే తీవ్రమైనవి. అసలే దుర్బలురు అయిన ఆ దీవి మూలవాసులు అందరూ మరింతగా పేదరికంలోకి జారిపోతారు. గిరిజన సముదాయాలను కాపాడాలనే రాజ్యాంగ నిర్దేశాలు పూర్తిగా ఉల్లంఘనకు గురవుతాయి. గ్రేట్ నికోబార్‌లో ప్రస్తుతం 8500 మంది నివసిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలయితే జనాభా సంఖ్య 40 రెట్లు పెరుగుతుంది. ఆ దీవి సంస్కృతి, పర్యావరణంపై భారతదేశ ప్రధాన భూభాగం నుంచి జనాభా వలసల ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. ఆ మార్పు చాలా హానికరంగాను, మార్చలేనిదిగాను ఉంటుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

అండమాన్ నికోబార్ దీవులలో విస్తృతంగా క్షేత్ర పరిశోధనలు చేసిన అజయ్ సైని, అన్విత అబ్బి ఇటీవల ఒక వ్యాసంలో ఇలా రాశారు: 'గ్రేట్ నికోబార్ మెగా ప్రాజెక్టు కేవలం ఒక పర్యావరణ విపత్తు మాత్రమే కాదు; అభివృద్ధి పేరిట జరుగుతున్న ఉద్దేశపూర్వక, భయంకర, భాషాసంబంధి, సాంస్కృతిక జాతి సంహారం'. ఈ మెగా ప్రాజెక్టు గ్రేట్ నికోబార్‌ను సామాజిక నిర్మాణాలను పర్యావరణ వ్యవస్థలనూ పూర్తిగా ధ్వంసంచేస్తుంది. ఆర్థిక లబ్ధిపరంగా చూసిన అది సమర్థనీయమైన ప్రాజెక్టు కానేకాదు. ఫ్రంట్‌లైన్‌లో వెలువడిన ఒక వ్యాసం శీర్షిక 'The numbers do not add up' (సంఖ్యలు కలిసిరావు) ఆ వాస్తవాన్ని ప్రభావదాయకంగా చెప్పింది. నౌకాశ్రయం, పర్యాటక రంగం నుంచి సంభావ్య రాబడి పెద్దగా ఉండదని, ఆ ప్రాజెక్టును ఆర్థికంగా ప్రయోజనకరంగా చేయదని రాజశేఖర్ వ్యాఖ్యానించారు. మౌలిక సదుపాయాలను అభివృద్ధిపరిచేందుకు భారీ ధనరాశులను ఉపయోగించడం వాస్తవంగా ప్రైవేట్ కార్పొరేట్ ప్రయోజనాలకు దోహదం చేస్తుందని ఆయన అన్నారు. ఈ వ్యాసాలను చదవడం ద్వారా ఆ దీవి పర్యావరణాన్ని పరిరక్షించి సుస్థిరాభివృద్ధిని ప్రోత్సహించవలసిన శాసన విహిత బాధ్యతలు ఉన్న ప్రభుత్వ సంస్థలు, ఆదివాసీల హక్కులను రక్షించవలసిన రాజ్యాంగ బాధ్యత ఉన్న అధికారులు తమ విధ్యుక్త ధర్మాలను ఎలా విస్మరిస్తున్నారో దిగ్భ్రాంతి గొలుపుతుంది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ, భారతీయ వన్యప్రాణుల సంస్థ, నీతి ఆయోగ్, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ క్షేత్ర వాస్తవాలను జాగ్రత్తగా పరిశీలించకుండా, సాధ్యాసాధ్యాలను నిర్దుష్టంగా అంచనా వేయకుండా మెగా ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులను ఎంత నిరాలోచనగా మంజూరు చేశాయో పంకజ్ సంకలన గ్రంథం, ఫ్రంట్‌లైన్‌లోని వ్యాసాలు విపులంగా వివరించాయి.

ఈ హానికర వ్యవహారంలో గౌరవనీయ శాస్త్రవేత్తలు సైతం భాగస్వాములు కావడం కలవరం కలిగిస్తోంది. బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ మాజీ డైరెక్టర్ ఒకరు 2018లో ఈ మెగా ప్రాజెక్టుకు ఆక్షేపణ తెలుపడాన్ని పంకజ్ తన వ్యాసంలో ప్రస్తావించారు. 'చాలా ఆందోళనకరమైన ప్రాజెక్టు అని, దాన్ని అమలుపరిస్తే ప్రపంచ సాగర జీవవైవిధ్యపు అరుదైన ప్రదేశాలు పూర్తిగా ధ్వంసమవుతాయని' ఆ శాస్త్ర వేత్త అన్నారు. 'గ్రేట్ నికోబార్ జీవ వైవిధ్యాన్ని యథాతథంగా పరిరక్షించాలని, ఆ దీవి స్వతస్సిద్ధ పర్యావరణ వనరులను జాతీయ ఆస్తులుగా పరిరక్షించాలని ఆ శాస్త్రవేత్త సూచించారు.

# ముస్లింలపై మరో దాడి

**స్వాతంత్ర్య తొలి దశాబ్దంలో తీసుకువచ్చిన వక్ఫ్ చట్టం–1954ను రద్దు చేస్తూ పార్లమెంటు 1995లో కొత్త వక్ఫ్ చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టానికి 2013లో ప్రధాన సవరణలు చేశారు. జరిగిన సవరణలు 57 అని నా లెక్కలో తేలింది. దాదాపు 12 సంవత్సరాలు గడిచిపోయాయి. ఎవరి ప్రయోజనాల కోసమయితే ఆ చట్టాన్ని చేశారో వారు ఏమైనా ఫిర్యాదులు చేస్తే వాటి ఆధారంగా కొత్త సవరణలు తప్పనిసరి అని లేదా లాభదాయకమని ప్రభుత్వం విశ్వసించిన పక్షంలో సవరణల బిల్లు ద్వారా సదరు చట్టంలో సంస్కరణలు తీసుకురావచ్చు. అయితే వక్ఫ్ (సవరణ) బిల్లు–2025 చేసింది వక్ఫ్ చట్టాన్ని సంస్కరించడం ఎంత మాత్రం కాదు. అందుకు విరుద్ధంగా ప్రస్తుతమున్న చట్టాన్ని, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన సొంత ఉద్దేశాలతో గుర్తించడానికి వీలు లేకుండా వికృతం చేసింది. ఒక అసమగ్ర చట్టాన్ని తీసుకువచ్చింది. బహుళ మతాలు విలసిల్లుతున్న ఒక ప్రజాస్వామిక దేశంలో గౌరవించవలసిన మొదటి సూత్రం అన్ని మతాలు సమానమే అన్నది కాదూ? ఏదైనా ఒక మతానికి చెందిన మత సంస్థల నిర్వహణ అనేది విధిగా అదే మతస్థుల చేతుల్లో ఉండితీరాలి. హిందూ మతస్థులు అత్యధికంగా ఉన్న భారత్‌లో ఆ సూత్రం హిందూ దేవాదాయ, ధర్మాదాయ సంస్థలు అన్నిటికీ ఎటువంటి మినహాయింపు లేకుండా వర్తింప చేస్తున్నారు. 'మైనారిటీ' మతాల**




**విషయంలోనూ ఈ సూత్రాన్ని భారత రాజ్యాంగం ప్రకారం వర్తింప చేస్తున్నారు.**

మత సంస్థల నిర్వహణలో స్వేచ్ఛ అనే విషయమై భారత రాజ్యాంగ అధికరణ 26 ఇలా నిర్దేశించింది: 'ప్రజా సంక్షేమం, ఆరోగ్యకరమైన నైతికతలకు లోబడి మత సంస్థల నిర్వహణకు సంబంధించి ప్రతి మతానికి ఈ క్రింద ఉదహరింపబడిన స్వేచ్ఛ ఉంటుంది- మత, ధార్మిక సంస్థల సంస్థాపన, నిర్వహణ; మత విషయాల సంబంధిత కార్యకలాపాలను తమకుతామే నిర్వహించుకొనుట; స్థిర, చరాస్తులను సమకూర్చుకొనుట; చట్టం ప్రకారం సదరు స్థిర, చరాస్తుల నిర్వహణ. హిందూ మత సంస్థలు, దాతృత్వ సంస్థల పాలనా వ్యవహారాలను హిందువులు మాత్రమే నిర్వహిస్తున్నారు. హిందూ దేవాలయాలు, మత సంస్థలు, దాతృత్వ సంస్థల నిర్వహణ, పాలనా వ్యవహారాలలో హిందూయేతరులకు పాత్ర కల్పించాలని ఎవరూ సూచించరు, హిందువులు ఎవరూ అటువంటి సూచనను అంగీకరించబోరు. ఇది స్పష్టం. (అసలు హిందూయేతరులు ఎవరినీ తిరుమల-తిరుపతి దేవస్థానంలో కనీసం ఉద్యోగులుగా కూడా నియమించకూడదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు). ఇతర మతాలకు చెందిన కోట్లాది అనుయాయులు కూడా అదే అభిప్రాయాన్ని కలిగివున్నారు. ప్రస్తుతం హిందూ, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ మతాలకు సంబంధించిన ఆరాధనా మందిరాలు, దాతృత్వ సంస్థలలో ఏ ఇతర మతానికి చెందిన వ్యక్తికి పాత్ర కల్పించేందకు చట్టాలు అనుమతించడం లేదు. వక్ఫ్ చట్టం-1995 కింద ఆ సూత్రాన్ని నిష్ఠాబద్ధంగా పాటించారు. వక్ఫ్ అంటే ముస్లిం చట్టం గుర్తించిన ధార్మిక, మత, దాతృత్వ కార్యకలాపాల కోసం ఏ వ్యక్తి అయినా ఆస్తిని శాశ్వతంగా సమర్పించడం. ముస్లిమేతరులు సృష్టించిన వక్ఫ్‌లను సైతం న్యాయస్థానాలు గుర్తించడం జరిగింది. ఇందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి.


అంతేకాకుండా ప్రస్తుతమున్న చట్టం ప్రకారం ఒక వక్ఫ్ అనేది చాలవరకు స్వతంత్ర, స్వయంపాలిత ఆస్తి. రాష్ట్రాల స్థాయిలో వక్ఫ్ ఆస్తుల నియంత్రణకు అత్యున్నత సంస్థ వక్ఫ్ బోర్డు. ఇందులో సభ్యులు అందరూ విధిగా ముస్లింలే ఉంటారు. చీఫ్ ఎక్జిక్యూటివ్ అధికారి సైతం ముస్లిమే అయివుండాలి. ఈ బోర్డు తన అధికారాలను వక్ఫ్ ఆదేశాలకు, వక్ఫ్ లక్ష్యాలకు, వక్ఫ్ ఆచారాలు, ఉపయోగాలకు అనుగుణంగా చెలాయించాలి. వక్ఫ్ ఆస్తులపై న్యాయ నిర్ణయాలు తీసుకునే అధికారం ఒక ట్రిబ్యునల్‌కే ఉంటుంది. ఈ న్యాయాధికార సంస్థకు జిల్లా జడ్జి చైర్‌పర్సన్‌గా ఉంటారు. వివాదాస్పద సవరణ బిల్లు ఎంతో కాలంగా ఉన్న సూత్రాలు, ఆచరణలను తలకిందులు చేసింది: (1) 'ఏ వ్యక్తి అయినా' ఒక వక్ఫ్‌ను సృష్టించలేదు; కనీసం ఐదు సంవత్సరాలుగా ఇస్లాంను ఆచరిస్తున్నానని నిరూపించిన వ్యక్తి మాత్రమే ఒక వక్ఫ్‌ను సృష్టించాలి. ఎందుకు? ఒక వ్యక్తి తాను ఇస్లాంను ఆచరిస్తున్నానని ఎలా నిరూపించాలి? సమాధానం లేదు. (2) ఒక వక్ఫ్ సృష్టికర్త తన చర్యవెనుక ఎటువంటి 'వంచనాపూర్వక ఎత్తుగడ' లేదని నిరూపించాలి. 'వంచనాపూర్వక ఎత్తుగడ' అంటే ఏమిటి? సమాధానం లేదు; (3) వక్ఫ్‌గా సమర్పించిన ఆస్తి 'ప్రభుత్వ' ఆస్తి అని వాదన వస్తే దాని నిజానిజాలపై సీనియర్ ప్రభుత్వాధికారి విచారణ నిర్వహించాలి.

సదరు వక్ఫ్ ప్రభుత్వ ఆస్తి అవునో కాదో ఆ విచారణాధికారి నిర్ణయిస్తాడు. ప్రభుత్వ ఆస్తి అని నిర్ధారించిన పక్షంలో ఆ అధికారి అందుకు సంబంధించి రెవెన్యూ రికార్డులలో సవరణలు చేయాలి. ఇది న్యాయమూర్తి తన సొంత కేసులో తానే తీర్పు ఇవ్వడం'లాంటిది కాదా? ఈ ప్రశ్నకూ సమాధానం లేదు. (4) రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యులు ముస్లింలే అయి ఉండాలన్న నిబంధనను తొలగించారు. ఈ ప్రకారం ముస్లిమేతరులను కూడా వక్ఫ్ బోర్డులో నియమితులవుతారు. మరి దురుద్దేశాలతో వ్యవహరించే ఒక ప్రభుత్వం ముస్లిమేతరులనే ఎక్కువగా వక్ఫ్ బోర్డు సభ్యులుగా నియమించవచ్చు. ఇదొక తిరోగామి నిబంధన. మరి దీన్ని ఇతర మతాల సంస్థల పాలనావ్యవహారాలకు కూడా వర్తింపచేస్తారా? హిందూ మత/ దాతృత్వ సంస్థలలో హిందూయేతరులను నియమిస్తారా? సమాధానం లేదు; (5) వక్ఫ్ (సవరణ) బిల్లు నమూనా అద్వితీయమైనది. దీని స్ఫూర్తితో ఇతర మతాల సంస్థలకు సంబంధించిన చట్టాలలో కూడా సవరణలు చేస్తారా? బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ముస్లింలపై దాడిని జాతీయ పౌరుల పట్టిక/ పౌరసత్వ సవరణ చట్టంతో ప్రారంభించింది.

ఉమ్మడి పౌర స్మృతిని తొలుత ఉత్తరాఖండ్‌లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. ముస్లింలు మెజారిటీగా ఉన్న ఏకైక రాష్ట్రం జమ్మూ-కశ్మీర్‌ను విభజించి కేంద్ర పాలిత ప్రాంతాల స్థాయికి కుదించారు. 2019-20 నుంచి 2023-24 దాకా మైనారిటీలకు మొత్తం రూ.18,274 కోట్ల మేరకు బడ్జెట్ కేటాయింపులు చేశారు. అయితే ఆ మొత్తంలో రూ. 3,574 కోట్లు ఖర్చు పెట్టనే లేదు. మౌలానా ఆజాద్ ఫెలోషిప్ ఫర్ మైనారిటీ స్టూడెంట్స్‌తో సహా ముస్లింలకు అందిస్తున్న విద్యాసంబంధ సహాయాన్ని నిలిపివేశారు. వక్ఫ్ (సవరణ) బిల్లు ముస్లిం మతస్థులపై మరో దాడి, సందేహం లేదు. అదొక దుష్టయోచన ఫలితమని స్పష్టమవుతోంది. గత ఏడాది 18వ లోక్‌సభ ఎన్నికలలో ఓటర్లు తమకు ఇచ్చింది 240 సీట్లు మాత్రమే అయినప్పటికీ ప్రజల వైఖర్లు, అభిప్రాయాలు ఏమీ మారలేదని భారతీయ జనతా పార్టీ భావిస్తోంది. 17వ లోక్‌సభ కాలంలో అనుసరించిన రాజకీయ అజెండానే జాతీయ పాలక పార్టీ ఇప్పుడూ ఔదల దాల్చుతోంది. మార్పులేని ఆ అజెండానే అమలు పరిచేందుకు బీజేపీ నిశ్చయించుకుంది. అందులో భాగమే పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించిన కొత్త వక్ఫ్ చట్టం.

# భారత్‌పై బంగ్లా కుతంత్రం

**బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్ చైనా పంచన చేరిపోవాలని తెగ ఉబలాటపడుతున్నారు. గత నెలలో బీజింగ్‌ను సందర్శించిన ఆయన విస్మయకర ప్రకటన చేశారు. భారత్‌లోని ఏడు ఈశాన్య రాష్ట్రాలకు అసలు సముద్ర తీరమే లేదని, అక్కడి నుంచి బంగ్లాదేశ్ మీదుగానే సముద్రానికి చేరాల్సి ఉంటుందని అసందర్భంగా వ్యాఖ్యానించారు. యూనస్ వైఖరిని మన రాజకీయ పార్టీలన్నీ ముక్తకంఠంతో ఖండించాయి.**



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా నిరుడు ఉద్యమకారుల ధాటికి దేశం విడిచి భారత్‌లో ఆశ్రయం పొందారు. ఆ తరవాత మహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వ సారథిగా పగ్గాలు చేపట్టారు. అప్పటి నుంచి భారత్‌బంగ్లా సంబంధాలు వేగంగా క్షీణిస్తూ వచ్చాయి. హసీనా భారత్, చైనాలతో సమతౌల్య సంబంధాలను కొనసాగించారు. ఆమె ప్రభుత్వం చైనా నుంచి ఆర్థిక సాయం పొందుతూనే భారతదేశ భద్రతా ప్రయోజనాలకు భంగం కలగకుండా నడుచుకుంది. హసీనా హయాంలో భారత్‌బంగ్లా మధ్య నాలుగు వేల కిలోమీటర్ల పొడవైన సరిహద్దు వెంబడి బందోబస్తు చక్కగా జరిగింది. ఉభయ దేశాల మధ్య రైలు, రోడ్డు, జలమార్గాల అనుసంధాన ప్రాజెక్టులు చేపట్టారు. చైనాతో దోస్తీ కోసం ఇండియాతో మైత్రిని పణంగా పెట్టబోమని హసీనా స్పష్టీకరించారు. తాను భారతదేశానికి నమ్మకస్తురాలైన నేస్తాన్నని నిరూపించుకున్నారు. దీనికి భిన్నంగా యూనస్ డ్రాగన్‌కు వత్తాసు పలుకుతున్నారు.

**చైనా పట్టించుకుంటుందా?**

యూనస్ తన చైనా పర్యటన సందర్భంగా భారతదేశ ఈశాన్య రాష్ట్రాల ప్రస్తావన తీసుకురావడం ఎందుకనే ప్రశ్న తలెత్తుతోంది. వాటికి సముద్ర తీరం లేదనడమే కాకుండా ఇది చైనాకు మహదావకాశమని, బంగ్లాలో పెట్టుబడులు పెట్టి ఉత్పత్తి సాగించవచ్చని ఆయన అన్నారు. చైనా వస్తువులను బంగ్లా మీదుగా విదేశాలకు ఎగుమతి చేయవచ్చనీ, విదేశాల నుంచి దిగుమతయ్యే సరకులను చైనాకు తీసుకెళ్లవచ్చనీ యూనస్ చెప్పుకొచ్చారు. అంతేకాకుండా, తమ దేశంలో వైమానిక స్థావరాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా చైనాను ఆయన ఆహ్వానించినట్లు వార్తలు వచ్చాయి. యూనస్ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాధినేతేమీ కాదు. బంగ్లాలో ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పడితే ఆయన దిగిపోవాల్సిందే. అలాంటి వ్యక్తి ప్రతిపాదనలను చైనా పెద్దగా పట్టించుకోవడం అనుమానమే. అదీకాకుండా ట్రంప్ అధ్యక్షుడైన తరవాత చైనాకు అమెరికా నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఇండియాతో సంబంధాలను పటిష్ఠం చేసుకోవాలని డ్రాగన్ ఆరాటపడుతోంది. భారత్‌చైనా దౌత్య సంబంధాలు చిగురించి 75 ఏళ్లు అయిన సందర్భంగా రాష్ట్రపతి ముర్ముకు పంపిన అభినందన సందేశంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తన అభిమతాన్ని బలంగా వ్యక్తీకరించారు. డ్రాగన్(చైనా), ఏనుగు(భారత్)ల మధ్య టాంగో నృత్యం(ఇద్దరి నర్తనం) ద్వైపాక్షిక సంబంధాల వృద్ధికి, బహుళ ధ్రువ ప్రపంచ సాధనకు అవసరమని ఆయన ఉద్ఘాటించారు. ఇలాంటి సానుకూల వాతావరణాన్ని చెడగొట్టడానికీ, భారత్, చైనాల మధ్య విభేదాలు పెంచడానికి యూనస్ ప్రయత్నిస్తున్నారు. ఆయన వ్యవహారంపై భారత ప్రభుత్వం వ్యూహాత్మక మౌనం పాటిస్తోంది.

**ప్రత్యామ్నాయం ముఖ్యం**

యూనస్ చైనాతోపాటు పాకిస్థాన్‌నూ భారత్ పైకి ఉసిగొల్పాలని తాపత్రయపడుతున్నారు. హసీనా పాలనలో బంగ్లా, పాక్‌ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. యూనస్ వచ్చిన తరవాత ఆ పరిస్థితి మారిపోయింది. ఏప్రిల్ 17న ఢాకాలో బంగ్లాపాక్ విదేశాంగ కార్యదర్శుల సమావేశం జరగనుంది. రెండు దేశాల మధ్య తక్కువ ఖర్చుతో విమాన ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడానికి 'ఫ్లై జిన్నా' అనే పాక్ సంస్థకు బంగ్లా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కాబట్టి, భవిష్యత్తులో ఎలాంటి అవాంతరం వచ్చినా ఎదుర్కోవడానికీ, ఈశాన్య భారతానికి మిగతా దేశంతో రవాణా అనుసంధానాన్ని పెంచడానికి కేంద్రం తక్షణమే చర్యలు తీసుకోవాలి. ఈశాన్యానికి రాకపోకలు కేవలం 20 కిలోమీటర్ల వెడల్పైన సిలిగురి కారిడార్ (చికెన్స్ నెక్) గుండా సాగుతున్నాయి. మయన్మార్, భూటాన్, బంగ్లాదేశ్‌లకు సైతం ఈ సన్నని దారి గుండానే వెళ్లి రావాలి. రేపు పొరుగుదేశాలతో యుద్ధం సంభవిస్తే మన సైనికులు, ట్యాంకులు, ఫిరంగులను ఈ ఇరుకు మార్గంలోనే పంపాల్సి ఉంటుంది. ప్రత్యర్థులు దాన్ని దిగ్బంధిస్తే ఈశాన్యంతో, మిగతా భారత భూభాగానికి లంకె తెగిపోతుంది. కాబట్టి, సిలిగురి కారిడార్ మీద ఆధారపడాల్సిన దుస్థితి నుంచి భారత్ బయటపడాలి. భారీ పెట్టుబడులు, సాంకేతికతను వాడి ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను ఏర్పరచుకోవాలి.

# భాష నేర్పని బండ చదువులు

**భాష ద్వారానే ఒక తరం నుంచి మరొక తరానికి జ్ఞానం, సంస్కృతీ సంప్రదాయాలు, విలువలు అందుతాయి. ఆధునిక సమాజంలో విద్య వ్యవస్థీకృతం అయినప్పటి నుంచి భాషల మనుగడను 'తరగతి గదుల' ద్వారానే ప్రభుత్వాలు నిర్దేశిస్తున్నాయి. నాటి పరాయి పాలన నుంచి, నేటి ప్రజాస్వామ్య పాలన వరకు పాఠశాలల్లో బోధించే భాషల గురించి ఏదో ఒక రూపంలో చర్చ కొనసాగుతూనే ఉంది.**




జాతి సమైక్యతే లక్ష్యంగా 1968, 1986, 2020ల్లో ప్రతిపాదించిన జాతీయ విద్యా విధానాల్లో కేంద్ర ప్రభుత్వాలు త్రిభాషా సూత్రాన్ని రూపొందించాయి. 1968, 1986ల్లోని త్రిభాషా సూత్రం ప్రకారం మొదటి స్థానం మాతృ లేదా స్థానిక భాషది కాగా, రెండోది హిందీ, మూడోది ఇంగ్లిష్. దానికి భిన్నంగా 2020 విధానంలో హిందీని తప్పనిసరి చేయలేదు. తద్వారా భాషల ఎంపికలో రాష్ట్రాలకు, తల్లిదండ్రులకు స్వేచ్ఛనిచ్చారు. మూడింటిలో ఏవైనా రెండు భారతీయ భాషలు, మరొక అంతర్జాతీయ భాష నేర్చుకోవచ్చని నిబంధనలు మార్చారు. మహాత్మా గాంధీ 1919లో దక్షిణ భారత హిందీ మహాసభను మద్రాస్‌లో ఏర్పరచిన తరవాత, తెలుగు ప్రాంతాల్లో హిందీ నేర్చుకోవడం ఉద్యమ స్ఫూర్తితో జరిగింది. మద్రాస్ ప్రెసిడెన్సీలో 1930ల నుంచే హైస్కూళ్లలో హిందీని ఐచ్ఛికంగా బోధించేవారు. 1957 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్.ఎస్.ఎల్.సి పబ్లిక్ పరీక్షలలో హిందీని తప్పనిసరి చేయగా, తమిళనాడులో మాత్రం 1968 వరకూ అది ఐచ్ఛికమే! తమిళనాడులో హిందీ వ్యతిరేక ఉద్యమం అనంతరం ద్విభాషా సూత్రాన్ని అమలు చేయడం మొదలు పెట్టారు. దీని ప్రకారం విద్యార్థులు మాతృభాష, ఇంగ్లిష్ మాత్రమే నేర్చుకుంటారు.

**అల్పసంఖ్యాకుల హక్కులు**

ద్విభాషా విధానంలో మొదటి భాషగా తమిళాన్ని తప్పనిసరిగా చదవాలని తమిళనాడు ప్రభుత్వం 2006లో ఉత్తర్వులిచ్చింది. దానిపై వివిధ భాషా సంఘాల ఒత్తిడి మేరకు ఇతర భాషలను ఐచ్ఛికంగా చదువుకోవచ్చని, అందులో ఉత్తీర్ణులు కావాల్సిన అవసరం లేదని చెప్పింది. దానివల్ల భాషా అల్పసంఖ్యాకుల్లో మాతృభాష చదివే విద్యార్థులు గణనీయంగా తగ్గారు. చదివే వారిలోనూ శ్రద్ధగా నేర్చుకోవడం బాగా లోపించింది. అయితే, అల్పసంఖ్యాకులకు వారి మాతృభాషల్లోనూ మిగతా సబ్జెక్టులతో సమానంగా ఉత్తీర్ణతా మార్కులు రావాలని, వాటిని తప్పనిసరిగా మార్కుల లిస్టులో పొందుపరచాలని సుప్రీంకోర్టు తీర్పిచ్చింది. ఒకవేళ తమిళనాడులో త్రిభాషా సూత్రం అమలులో ఉంటే మొదటి భాషగా తమిళం, రెండో భాషగా అల్పసంఖ్యాకులు వారి మాతృభాషను, మూడో భాషగా ఇంగ్లిష్ నేర్చుకునే అవకాశం ఉండేది. త్రిభాషా సూత్రంపై చర్చలు రాజకీయ వ్యూహ ప్రతివ్యూహాలలో చిక్కుకుపోయి, విద్యార్థులకు వివిధ భాషలలో సంభాషణా సామర్థ్యం రావాలన్న లక్ష్యాన్ని మరుగున పరిచాయి. ఆంధ్రప్రదేశ్ హైస్కూళ్లలో హిందీని ఆరు నుంచి పదో తరగతి వరకు 300 గంటలు బోధిస్తున్నారు. శ్వేతజాతీయుడు అమెరికాలో ఉండి ఇంటర్మీడియట్ స్థాయి హిందీ నేర్చుకోవడానికి 450 గంటలు అవసరం. ఆ స్థాయి అంటే దైనందిన జీవితంలో ఉత్తర భారతీయులతో హిందీలో చక్కగా మాట్లాడగలగడం. ఏపీలో 300 గంటలు నేర్పుతున్నా చాలామందికి హిందీ ఎందుకు రావడం లేదు? మరోవైపు మన పాఠశాలల్లో మాతృభాషా మాధ్యమంలో చదువుకునే వారికి రెండో భాషగా ఇంగ్లిష్‌ను 1400 గంటలు (అదే ఆంగ్ల మాధ్యమంలో అయితే 5500 గంటలు పైన) బోధిస్తున్నారు. అయినా చాలా మందిలో కనీస ప్రమాణాలు మృగ్యమవుతున్నాయి. విద్యాహక్కు చట్ట నియమాల ప్రకారం ప్రతి భాషలో ఆయా తరగతుల స్థాయిలో వినడం, మాట్లాడటం, చదవడం, రాయడం అనే నాలుగు నైపుణ్యాలు విద్యార్థులకు రావాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పై లక్ష్యాలకు అనుగుణంగా పాఠ్య పుస్తకాల రూపకల్పన, పాఠ్యాంశాల బోధన, పరీక్షల విధానంలో ఎలాంటి సంస్కరణలు తేలేదు. చివరికి ఉపాధ్యాయుల అర్హత, ఎంపిక పరీక్షలైన టెట్, డీఎస్సీల్లో ఆయా భాషలు బోధించే వారి 'మాట్లాడే నైపుణ్యాల' స్థాయినీ పరీక్షించడం లేదు. విద్యార్థులు వివిధ భాషలు నేర్చుకోవడం వల్ల దేశ సమైక్యత పెంపొందుతుందన్న జాతి నిర్మాతల ఆకాంక్షలను విద్యాశాఖలు విఫలం చేశాయి.


## హిందూ మహాసముద్రంలో బీ2 స్టీల్త్ బాంబర్లు,
# యుద్ధ నౌకల్ని మోహరించిన అమెరికా

డోనాల్డ్ ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌లపై ప్రపంచదేశాలు టెన్షన్‌లో ఉండగా, గుట్టుచప్పుడు కాకుండా అమెరికా మాత్రం తన సైనిక కదలికల్ని మరింత పటిష్టం చేసుకుంటోంది. హిందూ మహాసముద్రం, ఇండోపసిఫిక్ ప్రాంతాల్లో.. బీ2 బాంబర్ల ను మోహరించింది. అతి పెద్ద సంఖ్యలో బీ2 బాంబర్లను హిందూ మహాసముద్రంలో మోహరించేందుకు పెంటగాన్ ఆదేశాలు జారీ చేసింది. దీంతో డీగో గార్సియా దీవిలో ఉన్న మిలిటరీ బేస్‌కు ఆరు బీ2 బాంబర్ విమానాలను మోహరించారు. ప్లానెట్ ల్యాబ్స్ శాటిలైట్ చిత్రాల ఆధారంగా వాటిని కన్ఫర్మ్ చేశారు. ఇంకా అక్కడ ఉన్న షెల్టర్లు, హ్యాంగర్లలో ఏమైనా బాంబర్లు ఉండి ఉంటాయని అంచనా వేస్తున్నారు.



అమెరికా వద్ద మొత్తం 20 బీ2 స్టీల్త్ బాంబర్ల ఉన్నాయి. అత్యంత అత్యాధునిక మిలిటరీ విమానాల్లో ఆరింటిని ప్రస్తుతం హిందూ మహాసముద్రంలో మోహరించారు. అంటే తమ వద్ద ఉన్న ఫ్లీట్‌లో 30 శాతం అక్కడే ఉన్నట్లు స్పష్టం అవుతోంది. దీంట్లో చాలా వ్యూహాత్మక ఎత్తుగడలు ఉన్నట్లు భావిస్తున్నారు. బీ2 బాంబర్లతో పాటు యుద్ధ విమానాలను మోసుకెళ్లే నౌకలను ఇండోపసిఫిక్ ప్రాంతంలో మోహరిస్తున్నారు. రెండు యుద్ధ నౌకలను హిందూ మహాసముద్రంలోకి, ఒకటి దక్షిణ చైనా సీ వద్దకు తీసుకెళ్తున్నారు.

యూఎస్ఎస్ కార్ల్ విన్సన్.. మిడిల్ ఈస్ట్‌కు వెళ్తోంది, ఇక యూఎస్ఎస్ హ్యార్ ఎస్ ట్రూమన్.. ఆరేబియా సముద్రం నుంచి ఆపరేట్ చేస్తుంది. ఇక మూడవ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ యూఎస్ఎస్ నిమిట్జ్..దక్షిణ చైనా సముద్రం దిశగా వెళ్లేందుకు పెంటగాన్ ప్లాన్ చేసింది. అకస్మాత్తుగా యుద్ధ నౌకలను ఎందుకు మోహరిస్తుందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే హిందూ మహాసముద్ర ప్రాంతంలో రక్షణ వ్యవస్థ బలోపేతం చేసే ఉద్దేశంతో ఈ చర్య చేపట్టినట్లు పెంటగాన్ తెలిపింది.యమెన్‌లోని హౌతీ మిలిటెంట్లను టార్గెట్ చేసే ఉద్దేశంతో బీ2 బాంబర్లను అమెరికా మోహరించినట్లు అనుమానిస్తున్నారు. అయితే ఒక్కొక్క బాంబర్ విమానం సుమారు 40 వేల పౌండ్ల సామర్థ్యం ఉండే పేలోడ్‌ను మోసుకెళ్లగలవు. అయితే యెమెన్ మిలిటెంట్లను తుదముట్టించేందుకు ఆ బాంబర్లు చాలా ఎక్కువవుతాయని రక్షణ శాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు.



## రోగులకు గుండె ఆపరేషన్లు చేసిన
# నకిలీ డాక్టర్.. ఏడుగురు మృతి

భోపాల్: ఒక నకిలీ డాక్టర్ పలువురు రోగులకు గుండె ఆపరేషన్లు చేశాడు. అయితే ఒకే నెలలో ఏడుగురు మరణించారు. దీంతో ఆ డాక్టర్‌పై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో దర్యాప్తు జరుపగా అతడు నకిలీ డాక్టర్ అని తేలింది. మధ్యప్రదేశ్‌లోని దామోహ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఎన్ జాన్ కెమ్ అనే వ్యక్తి ప్రముఖ కార్డియాలజిస్ట్‌గా చెప్పుకున్నాడు. అదే పేరున్న ప్రసిద్ధ బ్రిటిష్ వైద్యుడిగా ధృవీకరణ పత్రాలు సృష్టించాడు. దామోహ్‌లోని క్రిస్టియన్ మిషనరీ ఆసుపత్రిలో డాక్టర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో పలువురు రోగులకు హార్ట్ సర్జరీలు చేశాడు. కాగా, గుండె ఆపరేషన్లు చేయించుకున్న రోగుల్లో ఒకే నెలలో ఏడుగురు వ్యక్తులు మరణించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆ డాక్టర్‌పై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో న్యాయవాది, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా అధ్యక్షుడు దీపక్ తివారీ ఆ డాక్టర్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. సర్జరీ తర్వాత మరణించిన రోగుల మరణాల సంఖ్య మరింత ఎక్కువగా ఉండవచ్చని ఆందోళన వ్యక్తం చేశాడు. మరోవైపు జిల్లా కలెక్టర్ ఆదేశంతో దర్యాప్తు బృందం ఆ క్రిస్టియన్ మిషనరీ ఆసుపత్రిని సందర్శించింది. అక్కడున్న అన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రముఖ బ్రిటీష్ వైద్యుడు ఎన్ జాన్ కెమ్ పేరుతో అతడు నకిలీ పత్రాలు సమర్పించినట్లు తెలుసుకున్నారు.కాగా, నకిలీ డాక్టర్ అసలు పేరు నరేంద్ర విక్రమాదిత్య యాదవ్ అని దర్యాప్తులో తేలింది. హైదరాబాద్‌లో క్రిమినల్ కేసు నమోదుతో సహా పలు వివాదాల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆ నకిలీ డాక్టర్‌తోపాటు రోగుల మరణాలపై మరింతగా దర్యాప్తు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

## స్టార్టప్‌లపై వ్యాఖ్యలను కాంగ్రెస్
# వక్రీకరించింది: పీయూష్ గోయల్

భారత స్టార్టప్ లను ఉద్దేశిస్తూ కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. మన స్టార్టప్‌లు ఐస్‌క్రీమ్‌లు, చిప్స్ తయారీ వద్దే ఆగిపోకుండా చైనా తరహాలో ఏఐ వంటి అంశాలపై దృష్టిసారించాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలను పలువురు తప్పుబట్టారు. తాజాగా ఈ విమర్శలపై ఆయన స్పందించారు. కాంగ్రెస్ పార్టీ నేతలే తన వ్యాఖ్యలను తప్పుగా ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

గోయల్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. 'స్టార్టప్‌లపై నా సందేశం సానుకూలంగానే ఉంది. కాంగ్రెస్ పార్టీ నేతలే వాటిని తప్పుగా ప్రచారం చేస్తున్నారు. ఇది వారి ప్రతికూల విధానాన్ని ప్రతిబింభిస్తోంది. ఆ పార్టీకి చెందిన సామాజిక మాధ్యమాలు దీనిపై అనవసరంగా వివాదాలు రేకెత్తిస్తున్నాయి. యువ భారతీయులు ఈ స్టార్టప్‌లపై ప్రపంచంతో పోటీ పడేందుకు సిద్ధంగా ఉన్నారు' అని గోయల్ పేర్కొన్నారు.




గురువారం స్టార్టప్ మహాకుంభ్ కార్యక్రమంలో గోయల్ పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు. మనం ఫుడ్ డెలివరీ యాప్స్‌పై దృష్టిసారించామని.. ఇలాంటి వాటివల్ల దిగువ శ్రేణి కార్మికులు తయారై సంపన్నులు కాలు బయటపెట్టకుండా ఆహారం పొందగలుతున్నారన్నారు. అదే సమయంలో చైనా సంస్థలు ఏఐ, ఈవీలు, సెమీ కండక్టర్ల రంగాలను ఎంచుకుంటున్నాయని తెలిపారు. కొత్త అంకుర సంస్థలు భవిష్యత్‌తరాల కోసం దేశాన్ని సిద్ధం చేయాలని ఈసందర్భంగా పిలుపునిచ్చారు. 'ఐస్‌క్రీమ్‌లు, కిరాణా సరకులు వేగంగా డెలివరీ చేయడం ఆవిష్కరణా?' అని గోయల్ ప్రశ్నించారు.

ఈ వ్యాఖ్యలను జెప్టో సీఈఓ అదిత్ పలిచా, జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ వంటి ప్రముఖులు తప్పుబట్టారు. ఉద్యోగాల సృష్టి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడంలో జెప్టో విజయం సాధించిందని, భారత ఆవిష్కరణల్లో ఇది అద్భుతమని అదిత్ పలిచా పేర్కొన్నారు. ఇంజినీర్‌లు, టెక్నాలజిస్ట్‌లు సవాల్‌గా తీసుకోవాలని, విమర్శగా భావించకూడదని జోహో వెంబు అన్నారు. దేశీయ అంకురాలపై గోయల్ నమ్మకం ఉంచాలని, డీప్‌టెక్ అంకురాలకు తోడ్పాటునివ్వాలని మోహన్‌దాస్ పాయ్ పేర్కొన్నారు. స్టార్టప్‌లలో ఉన్న ఇబ్బందులను పరిష్కరిస్తే, తప్పకుండా విజయం సాధిస్తామని.. చైనాతో భారత అంకురాలను పోల్చకూడదని తెలిపారు.

## ఆ బాలిక చదువు బాధ్యతలు తీసుకుంటా



ఉత్తర్‌ప్రదేశ్‌లోని అంబేద్కర్‌నగర్‌లో ఇటీవల అక్రమ గుడిసెలను తొలగిస్తున్నప్పుడు ఎనిమిదేళ్ల విద్యార్థిని తన పుస్తకాలను తీసుకెళ్తున్న వీడియో వైరల్ కాగా.. సదరు బాలిక విద్యా ఖర్చులను తాను భరిస్తానని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. యూపీలోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ''జ్ఞానానికి, తెలివికి బుల్డోజర్ చర్య చిహ్నం కాదు. అది విధ్వంసానికి పరాకాష్ఠ. వారు (భాజపా పాలకులు) పేదల గుడిసెలను కూల్చి విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారు. ఆ పిల్లల చదువు బాధ్యతలను మేం తీసుకుంటాం'' అని పేర్కొన్నారు. కాగా.. అంబేద్కర్‌నగర్‌లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి కొందరు గుడిసెలు వేసుకున్నారంటూ అధికారులు ఇటీవల అక్కడ కూల్చివేతలు చేపట్టారు. ఆ సమయంలో అనన్య యాదవ్ అనే ఎనిమిదేళ్ల బాలిక.. కూలగొడుతున్న గుడిసె నుంచి తన పుస్తకాలను తీసుకుని పరిగెడుతున్న వీడియో వివిధ మాధ్యమాల్లో వైరల్ అయింది. అధికారుల చర్యలను పలువురు ఖండించారు. సుప్రీంకోర్టు దృష్టికి సైతం ఈ వీడియో వెళ్లింది.

## నేపాల్‌లో 5 తీవ్రతతో భూకంపం..
# వణికిన ఉత్తరభారతం



హిమాలయ దేశం లో భూకంపం సంభవించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 5.0గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. గర్ఖాకోట్‌కు మూడు కి.మీ దూరంలో, 20కి.మీ లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు పేర్కొంది. శుక్రవారం సాయంత్రం 7.52 గంటల సమయంలో ప్రకంపనలు నమోదైనట్లు వెల్లడించింది.దీని తీవ్రతతో ఉత్తర భారతదేశంలోనూ ప్రకంపనలు నమోదయ్యాయి. ఢిల్లీ, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్‌లోని పలు చోట్ల భూమి కంపించింది. ఈ భూ ప్రకంపనలతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అయితే, ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదు. అంతకుముందు రోజు అంటే గురువారం మహారాష్ట్ర సోలాపూర్ జిల్లాలో 2.6 తీవ్రతతో భూమి కంపించిన విషయం తెలిసిందే.

## పంట చేలల్లో ఏఐ విప్లవం!

సంప్రదాయ వ్యవసాయానికి ఆధునిక సాంకేతికతను జోడిస్తే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో నిరూపిస్తున్నారు మహారాష్ట్ర రైతులు. చెరకు సాగులో కృత్రిమ మేధ (ఏఐ) ఉపయోగిస్తూ.. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధిస్తున్నారు. మైక్రోసాఫ్ట్, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం కలసి చేసిన ఈ సరికొత్త ప్రయోగం విజయవంతమైంది. దేశంలోనే తొలిసారి ఏఐని ఉపయోగిస్తూ పండించిన చెరకు పంట మరికొద్ది నెలల్లో చేతికి రానుంది! మహారాష్ట్ర బారామతికి చెందిన దాదాపు వెయ్యి మంది రైతులు ఈ అరుదైన ప్రయోగంలో భాగమయ్యారు. సంప్రదాయ సాగు బాటను వీడి, సాంకేతికతను అందిపుచ్చుకున్న వీరంతా 3040 శాతం ఆదాయం అధికంగా అందుకోబోతున్నారు!విస్తీర్ణంపరంగా అత్యధికంగా చెరకు సాగు చేస్తున్న దేశం భారత్. ఉత్పత్తి మాత్రం బ్రెజిల్, చిలీ కంటే చాలా తక్కువ. ఇంకా సంప్రదాయ సాగు విధానాలు అనుసరించడమే ఇందుకు కారణం. సాగులోని అనేక సమస్యలు రైతులకు నష్టాలు మిగల్చడమే కాక, పర్యావరణానికీ హాని కలిగిస్తున్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దాలని టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సంకల్పించింది. వ్యవసాయంలో సుస్థిరత సాధనే లక్ష్యంగా 'ప్రాజెక్ట్ ఫామ్ వైబ్స్' చేపట్టింది. వ్యవసాయంతో ముడిపడిన సమస్త సమాచారాన్నీ సాంకేతికత సాయంతో ముందే గుర్తించి, రైతులకు అందించడమే దీని ముఖ్య ఉద్దేశం. ఏఐ టెక్నాలజీ ఇచ్చే ఆ వివరాలకు అనుగుణంగా సాగు పద్ధతుల్లో మార్పులు చేస్తే లాభాలు ఖాయమన్నది ఆ సంస్థ ఆలోచన. మైక్రోసాఫ్ట్ ప్రాజెక్ట్‌ను భారత్‌కు తీసుకురావడంలో ప్రతాప్‌రావ్ పవార్ కీలకంగా వ్యవహరించారు. ఈయన.. మహారాష్ట్రలోని బారామతి వ్యవసాయాభివృద్ధి ట్రస్టుకు ధర్మకర్త. మైక్రోసాఫ్ట్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ తోడ్పాటుతో 'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఫామ్ వైబ్స్' ఏర్పాటు చేశారు. ట్రస్ట్ నిర్వహించే కృషి విజ్ఞాన కేంద్రం వేదికగా, బారామతికి చెందిన దాదాపు వెయ్యి మంది రైతులు ఏఐ వ్యవసాయంలో భాగమయ్యారు. ఈ టెక్ సేద్యానికి ఏఐతోపాటు అనేక అధునాతన సాంకేతికతలు మూలాధారం. శాటిలైట్ ఇమేజింగ్, రిమోట్ సెన్సింగ్, గ్రౌండ్ మిల్క్ ఇమేజింగ్, హైపర్‌స్పెక్ట్రల్ ఇమేజ్ టెక్నాలజీ ద్వారా రైతుకు అవసరమైన సమాచారం మొత్తాన్ని యాప్ ద్వారా అందిస్తారు.

## కేరళ సీఎం విజయన్‌కు షాక్



కేరళలో అధికార పక్షం లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్)కు ఎదురుదెబ్బ తగిలింది. అక్రమ చెల్లింపుల కుంభకోణంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ కుమార్తె టి.వీణను విచారించేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అక్రమ లావాదేవీల్లో ఆమె ప్రమేయం ఉన్నట్లుగా ఆరోపణలు రావడంతో కంపెనీల చట్టం ఉల్లంఘన కింద అభియోగాలు నమోదయ్యాయి. కార్పొరేట్ మోసాలను దర్యాప్తు చేసే భారత ప్రభుత్వ సంస్థ 'తీవ్ర మోసాల దర్యాప్తు కార్యాలయం' (సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్/ఎస్ఎఫ్ఐవో) కొచ్చిన్‌లోని ప్రత్యేక న్యాయస్థానంలో ఛార్జిషీటు సమర్పించిన నేపథ్యంలో ఈ అనుమతి లభించింది. ఇది రాజకీయ ప్రేరేపిత చర్యగా సీపీఎం పొలిట్‌బ్యూరో కోఆర్డినేటరు ప్రకాశ్ కారాట్, కేరళకు చెందిన సీపీఎం నేతలు శుక్రవారం ఖండించారు. చట్టపరంగా, రాజకీయంగా దీనిని ఎదుర్కొంటామంటూ తమిళనాడులోని మదురైలో జరుగుతున్న సీపీఎం మహాసభల్లో ఈ మేరకు పార్టీ ఓ తీర్మానం కూడా చేసింది. సీఎం విజయన్ రాజీనామా చేయాలన్న డిమాండును కాంగ్రెస్, భాజపా నాయకులు పునరుద్ఘాటించారు.

**రూ.2.70 కోట్ల అక్రమ లబ్ధి పొందారని..**

కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ నుంచి టి.వీణ నిర్వహిస్తున్న ఐటీ కంపెనీ 'ఎక్స్‌లాజిక్ సొల్యూషన్స్'కు రూ.2.70 కోట్ల చెల్లింపులు జరిగాయి. దీనికి బదులుగా ఎలాంటి ఐటీ సేవలు అందించలేదన్నది ఆరోపణ.

## తమిళ జాలర్లు, బోట్లను
# విడిచిపెట్టండి: శ్రీలంకను కోరిన ప్రధాని మోదీ

శ్రీలంక పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ తమిళ జాలర్ల సమస్యను లేవనెత్తారు. ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే వద్ద ఈ అంశాన్ని ప్రస్తావించారు. తమిళ జాలర్లను వెంటనే విడుదల చేయాలని, వారి పడవలను విడిచిపెట్టాలని కోరారు. రెండు దేశాల మధ్య ఏన్నో ఏళ్లుగా ఈ అంశం నలుగుతోంది. దానికి పరిష్కారం చూపే దిశగా తాజా పర్యటనలో చర్చలు జరిగాయి .

మత్స్యకారుల సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత కేంద్ర ప్రభుత్వానికే ఉందని ఇప్పటికే తమిళనాడు ప్రభుత్వం పలుమార్లు వెల్లడించింది. మోదీ శ్రీలంక పర్యటన నేపథ్యంలో ఇటీవల దీనిపై అభ్యర్థనలు చేసిన సంగతి తెలిసిందే. కచ్చతీవు వద్ద రాష్ట్ర జాలర్లు చేపలు పట్టేందుకు అనుమతించేలా చర్యలు తీసుకోవాలని తమిళనాడు సీఎం స్టాలిన్ తెలిపారు. తమ రాష్ట్ర మత్స్యకారులను భారతీయ జాలర్లుగా కేంద్రం చూడాలన్నారు. కచ్చతీవులో చేపలు పట్టడానికి వీలుగా శ్రీలంకతో కొత్త ఒప్పందం అవసరమన్నారు. 2010 తర్వాత శ్రీలంక భారత్ మధ్య జాలర్ల అంశంపై చర్చలు జరపలేదన్నారు. ఈ క్రమంలోనే తాజాగా మోదీ దీనిపై అభ్యర్థన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.



**ప్రధాని మోదీకి 'శ్రీలంక మిత్ర విభూషణ'..**

ప్రధాని మోదీ కి శ్రీలంక ప్రభుత్వం అత్యున్నత పురస్కారాన్ని ప్రదానం చేసింది. ద్వీపదేశ అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే 'శ్రీలంక మిత్ర విభూషణ' పురస్కారాన్ని అందజేశారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని ఆ దేశంలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. థాయ్‌లాండ్‌లో బిమ్‌స్టెక్ సదస్సు ముగిసిన అనంతరం శుక్రవారం సాయంత్రం ప్రధాని మోదీ నేరుగా అక్కడకు చేరకున్నారు. బండారునాయకే ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో దిగిన ఆయనను లంక ప్రభుత్వం ఘనంగా స్వాగతించింది. శనివారం ఉదయం ఇండిపెండెన్స్ స్క్వేర్ వద్ద అధ్యక్షుడు సంప్రదాయ పద్ధతుల్లో ఆహ్వానం పలికారు. ఇరుదేశాల మధ్య ఉన్న చరిత్రాత్మక సంబంధాలకు ప్రతీకగా ఈ స్వాగతం నిలిచింది.

ఇక రెండు దేశాల మధ్య కీలక రక్షణ ఒప్పందం కుదిరింది. ఈ మేరకు సంతకాలు జరిగాయి. ట్రింకోమలీని ఇంధన కేంద్రంగా అభివృద్ధి చేయడం, శ్రీలంక తూర్పు ప్రాంతానికి భారత్ గ్రాంట్ అందించడం వంటి ఒప్పందాలు జరిగాయి. అలాగే ఇద్దరు నేతలు సాంపూర్ సౌర విద్యుత్ ప్రాజెక్టును వర్చువల్‌గా ప్రారంభించారు. ద్వైపాక్షిక చర్చల అనంతరం మోదీ మాట్లాడుతూ.. ''2019లో జరిగిన ఉగ్రదాడి, కొవిడ్ మహమ్మారి, ఇటీవలి ఆర్థిక సంక్షోభం.. ఎలాంటి క్లిష్టసమయంలో అయినా భారత్ శ్రీలంక వెంట ఉంది. రెండు దేశాల భద్రతా ప్రయోజనాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. ఈ దిశగా జరిగిన రక్షణ సహకారం ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. మత్స్యకారుల సమస్యపై మానవతా దృక్పథంతో వ్యవహరించాలని అంగీకారానికి వచ్చాం. శ్రీలంక ప్రభుత్వం తమిళ ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుందని ఆశిస్తున్నాం. భారత ప్రయోజనాల విషయంలో అధ్యక్షుడు సానుకూలంగా స్పందిస్తున్నందుకు కృతజ్ఞతలు'' అని తెలిపారు. భారత ప్రయోజనాలకు విరుద్ధంగా శ్రీలంక భూభాగాన్ని వినియోగించనివ్వబోమని ఆ దేశాధ్యక్షుడు వెల్లడించారు. క్లిష్ట సమయాల్లో న్యూఢిల్లీ అందిస్తోన్న సహకారం ఎంతో విలువైనది అని పేర్కొన్నారు.

## కొనసాగుతున్న అనంత్ పాదయాత్ర

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ చిన్నకుమారుడైన అనంత్ అంబానీ (29) గుజరాత్‌లోని తమ పూర్వీకుల స్వస్థలం జామ్‌నగర్ నుంచి శ్రీకృష్ణుడు వెలసిన దివ్యక్షేత్రమైన ద్వారకకు చేపట్టిన పాదయాత్ర కొనసాగుతోంది. 170 కిలోమీటర్ల ఈ పాదయాత్రను మార్చి 29న ప్రారంభించిన అనంత్ రోజుకు 20 కి.మీ.ల చొప్పున నడుస్తున్నారు. నిత్యం రాత్రివేళ ఏడు గంటల చొప్పున నడుస్తూ మార్గ మధ్యంలో ఎదురయ్యే ప్రజలతో మమేకం అవుతున్నారు. తన 30వ పుట్టినరోజుకు రెండు రోజులు ముందుగా ఏప్రిల్ 8న ఆయన ద్వారకకు చేరుకుంటారు. ఈ యాత్రలో కొందరు స్థానికులు సైతం అనంత్‌కు సంఘీభావంగా వెంట నడుస్తున్నారు. మరికొందరు ఆయనకు ఎదురుగా వచ్చి ఫొటోలు తీసుకొంటున్నారు. హనుమాన్ చాలీసా, సుందరకాండ, దేవీ స్తోత్రాలను వల్లె వేస్తూ ఈ ఆధ్యాత్మిక పాదయాత్రలో అనంత్ ముందుకు సాగుతున్నారు.

### శ్రీ రామనవమి స్పెషల్..

# మామిడికాయతో కమ్మటి పులిహోర

## Mango Pulihora Recipe:

మండే ఎండలతో పాటే రుచికరమైన మామిడికాయలను వెంటబెట్టుకొస్తుంది వేసవి కాలం. చైత్రమాసం తొలినాళ్లలో వచ్చే శ్రీ రామనవమి పర్వదినాన మామిడికాయలతో పులిహోర చేసుకోవడం హిందూ సంప్రదాయం. ఈ రుచికరమైన వంటకంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. మరి, కమ్మటి మామిడికాయ పులిహోర ఎలా చేసుకోవాలో తెలుసా.. శ్రీ రామనవమి పండుగ వసంత ఋతువులో చైత్ర శుద్ధ నవమి రోజున వస్తుంది. సరిగ్గా మామిడికాయలు ఇదే సీజన్‌లో వస్తాయి. పచ్చి మామిడికాయలు అందుబాటులో ఉండటం వల్ల వీటిని ఉపయోగించి ఈ రోజున రుచికరమైన పులిహోర తయారు చేస్తారు. ఈ వంటకాన్ని శ్రీరామునికి నైవేద్యంగా సమర్పించి ఆ తర్వాత కుటుంబ సభ్యులతో పంచుకోవడం ఆనవాయితీ. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో మామిడికాయ పులిహోర చేయడం ఒక సంప్రదాయంగా మారింది. కమ్మటి ఘుమఘుమలాడే రుచికరమైన పులిహోర తయారీ విధానం ఏంటో తెలుసుకోండి.

### కావలసిన పదార్థాలు

అన్నం - 2 కప్పులు (ఉడికించి చల్లార్చినది)
పచ్చి మామిడికాయ - 1 (తురిమినది, సుమారు 1 కప్పు)
నూనె - 3 టేబుల్ స్పూన్లు
వేరుశనగ గింజలు - 2 టేబుల్ స్పూన్లు
శనగపప్పు - 1 టేబుల్ స్పూన్లు
మినపప్పు - 1 టేబుల్ స్పూన్
ఆవాలు - 1 టీస్పూన్
ఎండుమిర్చి - 2-3 (చిన్న ముక్కలుగా విరిచినవి)
పచ్చిమిర్చి - 2 (తరిగినవి)
కరివేపాకు - 10-12 ఆకులు
ఇంగువ - చిటికెడు
పసుపు - 1/2 టీస్పూన్
ఉప్పు - రుచికి సరిపడా
కొత్తిమీర - అలంకరణకు



### తయారీ విధానం:

ముందు అన్నాన్ని కొంచెం పొడిగా వండుకుని ఒక గిన్నెలోకి తీసి చల్లారనివ్వండి. తర్వాత ఒక కడాయిలో నూనె వేడి చేసి ఆవాలు వేయండి. ఆవాలు చిటపటలాడిన తర్వాత శనగపప్పు, మినపప్పు, వేరుశనగ గింజలు వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించండి. తర్వాత ఎండుమిర్చి, పచ్చిమిర్చి, కరివేపాకు, ఇంగువ వేసి కొన్ని క్షణాలు వేగనిచ్చి.. తురిమిన పచ్చి మామిడికాయ, పసుపు, ఉప్పు వేసి 2-3 నిమిషాలు మగ్గనివ్వండి. మామిడి తురుము మెత్తగా అయ్యే వరకు ఉడికించాలి. ఈ మిశ్రమాన్ని చల్లార్చిన అన్నంలో వేసి జాగ్రత్తగా కలపండి. చివరగా అన్నంపై కొత్తిమీర అలకరించి వేడిగా సర్వ్ చేయండి.

మామిడికాయ పులిహోర ఆరోగ్య ప్రయోజనాలు :
శ్రీరామనవమి సందర్భంగా ఇళ్లల్లో వండుకునే మామిడికాయ పులిహోర కేవలం రుచికరమైన వంటకమే కాదు. ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పచ్చి మామిడికాయలో విటమిన్ సి, విటమిన్ ఎ, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి అనేక విధాలుగా ఉపయోగపడతాయి. పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం పచ్చి మామిడిలోని విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇది వసంత కాలంలో వచ్చే ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ కల్పిస్తుంది. ఐరన్ శోషణను మెరుగుపరుస్తుంది. చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఇంకా మామిడిలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను సులభతరం చేసి మలబద్ధకం నివారణకు సహాయపడుతుంది. ఇందులోని అమైలేస్ ఎంజైమ్‌లు కార్బోహైడ్రేట్లను విచ్ఛిన్నం చేసి జీర్ణ శక్తిని పెంచుతాయి. పచ్చి మామిడిలోని యాంటీఆక్సిడెంట్ గుణాలు వృద్ధాప్య లక్షణాలను తగ్గిస్తుంది. ఈ వంటకంలో వాడే వేరుశనగ గింజలు, పప్పులు ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులను అందిస్తాయి. పసుపులో యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయని తెలిసిందే. అందుకే ఈ శ్రీరామనవమి నాడు మామిడికాయ పులిహోరతో సంప్రదాయాన్ని ఆస్వాదిస్తూనే ఆరోగ్యాన్ని కాపాడుకోండి.

# కేరళ.. పనస తొనల హల్వా..

వేసవిలో ద్రవ పదార్థాలే ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. ఇలా చేయడం వల్ల ఆకలి తగ్గి సరిపడినంత ఆహారం తినలేకపోతారు. ఇలా జరగకూడదంటే కేరళ స్టైల్ జాక్ ఫ్రూట్ హల్వా ఓసారి తిని చూడండి. తిన్నాక శక్తి వస్తుంది. ఆకలి పెరుగుతుంది. మరి, దీని రెసిపీ ఏంటో తెలుసుకోవాలంటే..
ఎండకాలంలో వేడి వాతావరణం కారణంగా ఎక్కువగా నీళ్లు లేదా చల్లని పదార్థాలే తాగుతుంటారు. ఇలా చేయడం వల్ల ఆకలి మందగించి తగినంత పోషకాహారం తీసుకోలేరు. తద్వారా త్వరగా శక్తి కోల్పోయి అలసట, నీరసం ఆవరిస్తుంది. అదే ఈ పదార్థం తిన్నారనుకోండి. ఎనర్జీ లెవెల్స్ పెరిగి ఆకలి కూడా బాగా వేస్తుంది. మరి, ఆ ఆహారపదార్థం ఏంటా అని ఆలోచిస్తున్నారా.. అదే పనస తొనల హల్వా. కేరళలో బెస్ట్ సమ్మర్ రెసిపీగా పేరొందిన ఈ తియ్యటి నోరూరించే హల్వాని ఇంట్లోనే ఎంచక్కా ఇలా తయారుచేసుకోండి. రుచికి రుచి. ఆరోగ్యానికి ఆరోగ్యం.



పనస తొనల హల్వా తయారీ విధానం గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

కావాల్సిన పదార్థాలు :
పనస తొనలు- ఒక కప్పు,
బెల్లం- పావు కప్పు,
నెయ్యి- రెండు చెంచాలు,
పచ్చి కోవా- రెండు చెంచాలు,
యాలకుల పొడి- చిటికెడు,
బాదం- ఎనిమిది,
జీడిపప్పు- పది,
పిస్తా- పన్నెండు

తయారీ విధానం :
ముందుగా గింజలు తీసేసిన పనస తొనలను మిక్సీలో వేసి మెత్తని పేస్టులా చేయాలి.
స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో అర కప్పు నీళ్లు పోసి బెల్లం వేసి కరిగించాలి. తరువాత బెల్లం నీళ్లను ఒక గిన్నెలోకి వడబోయాలి.
స్టవ్ మీద పాన్ పెట్టి నెయ్యి వేసి వేడిచేయాలి. ఇందులో బాదం, జీడిపప్పు, పిస్తా వేసి దోరగా వేపి ఒక పళ్లెంలోకి తీసుకోవాలి. తరువాత పాన్‌లో పనస తొనల పేస్టు వేసి బాగా కలపాలి. పచ్చివాసన పోయేవరకూ వేగనివ్వాలి. తరువాత బెల్లం నీళ్లు పోసి కలుపుతూ ఉండాలి. ఈ మిశ్రమం పాన్ నుంచి విడిపోతున్నప్పుడు పచ్చికోవా, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. రెండు నిమిషాల తరవాత వేయించిన బాదం, జీడిపప్పు, పిస్తా వేసి కలిపి స్టవ్ నుంచి కిందకి దించేయాలి. ఈ హల్వాని వేడిగా లేదంటే చల్లగా కూడా సర్వ్ చేసుకోవచ్చు.

జాగ్రత్తలు:
ఈ హల్వాని చిన్న మంట మీదనే తయారు చేసుకోవాలి.
పనస తొనలు తియ్యగానే ఉంటాయి కాబట్టి అంతగా తీపి తినని వాళ్లు ఒక చెంచా బెల్లం తగ్గించి వేసుకోవచ్చు.
ఒక చెంచా కార్న్‌ఫ్లోర్‌ని పావు కప్పు నీళ్లలో కలిపి ఈ మిశ్రమాన్ని పచ్చికోవాకు బదులు వేసుకోవచ్చు.



# ఫ్రైడ్ ఇడ్లీ



### కావలసిన పదార్థాలు

ఇడ్లీలు: నాలుగు, పల్లీలు, శనగపప్పు, మినుపపప్పు, బియ్యం, ధనియాలు: ఒక టేబుల్ స్పూన్ చొప్పున, మిరియాలు: ఒక టీస్పూన్, కరివేపాకు: రెండు రెబ్బలు, ఎండుమిర్చి: నాలుగు, ఉప్పు: తగినంత, నూనె: వేయించడానికి సరిపడా, చాట్ మసాలా: పావు టీస్పూన్.

### తయారీ విధానం

ఇడ్లీలను పొడవాటి ముక్కలుగా కోయాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనెపోయాలి. బాగా వేడయ్యాక ఇడ్లీ ముక్కలను రంగు మారే వరకు వేయించాలి. స్టవ్‌మీద పాన్‌పెట్టి పల్లీలు, శనగపప్పు, ఎండు మిర్చి, బియ్యం, ధనియాలు, మిరియాలు, కరివేపాకు వేయించాలి. చల్లారిన తర్వాత అన్నిటినీ మిక్సీలో వేసి తగినంత ఉప్పు కలిపి మెత్తగా పొడి చేసుకోవాలి. వేయించిన ఇడ్లీ ముక్కలను ఒక గిన్నెలో కుమ్మరించి పైనుంచి పప్పుల పొడి, చాట్ మసాలా వేసి కలిపితే ఫ్రైడ్ ఇడ్లీ సిద్ధం.

# పంజాబ్‌పై రాజస్థాన్ రాయల్స్ విజయం








చండీగఢ్: ఐపీఎల్ 18 సీజన్‌లో హ్యాట్రిక్ విజయంపై కన్నేసిన పంజాబ్ కింగ్స్‌కు రాజస్థాన్ రాయల్స్ షాక్ ఇచ్చింది. పంజాబ్‌పై రాజస్థాన్ 50 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో పంజాబ్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 155 పరుగులే చేసింది. ఆ జట్టు బ్యాటర్లలో నేహాల్ వధేరా (62; 41 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మాత్రమే రాణించాడు. మ్యాక్స్‌వెల్ (30; 21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) పరుగులు చేశాడు. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (17), శ్రేయస్ అయ్యర్ (10), శశాంక్ (10*) పరుగులు చేశారు. ప్రియాంశ్ ఆర్య డకౌట్ కాగా.. స్టాయినిస్ (1), సుర్యాంశ్ షెడ్గే (2) సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 3, సందీప్ శర్మ 2, మహీశ్ తీక్షణ 2, కుమార్ కార్తికేయ, వానిందు హసరంగ చెరో వికెట్ తీశారు.

**ఆరంభంలోనే వరుస షాక్‌లు**

లక్ష్యఛేదనకు దిగిన పంజాబ్‌కు ఆర్చర్ ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే షాక్ ఇచ్చాడు. ఫస్ట్ బాల్‌కు ప్రియాంశ్‌ను, చివరి బంతికి శ్రేయస్ అయ్యర్‌ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. కాసేపటికే స్టాయినిస్‌ని సందీప్ వెనక్కి పంపాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన వధేరాకు 4 పరుగుల వద్ద జీవదానం లభించింది. ప్రభ్‌సిమ్రన్‌ను కార్తికేయ ఔట్ చేశాడు. దీంతో పంజాబ్ 43 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో మ్యాక్స్‌వెల్‌తో కలిసి వధేరా ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టాడు. ఈ జోడీ ఐదో వికెట్‌కు 88 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. వీరిద్దరూ వరుస బంతుల్లో ఔటవడంతో పంజాబ్ గెలుపు ఆశలు ఆవిరయ్యాయి.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్‌కు ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (67; 45 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లు), సంజు శాంసన్ (38; 26 బంతుల్లో 6 ఫోర్లు) శుభారంభం అందించారు. ఈ జోడీ తొలి వికెట్‌కు 89 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. చివర్లో రియాన్ పరాగ్ (43*; 25 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. నితీష్ రాణా (12), హెట్‌మయర్ (20), ధ్రువ్ జురెల్ (13*; 5 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) పరుగులు చేశారు. పంజాబ్ బౌలర్లలో ఫెర్గూసన్ 2, అర్ష్‌దీప్, మార్కో యాన్సెన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.



### ఛేదనలో మరోసారి చిత్తైన సూపర్ కింగ్స్..

# ఢిల్లీకి వరుసగా మూడో విజయం

ఐపీఎల్ 18 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. తొలిరెండు మ్యాచుల్లో విజయాలు సాధించిన ఢిల్లీ మూడో పోరులోనూ విజయభేరి మోగించింది. చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌ను 25 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించింది. కేఎల్ రాహుల్(77) అర్ధ శతకంతో చెలరేగగా.. బౌలర్లు ఆదిలోనే వికెట్లు తీసి చెన్నైని ఓటమి అంచులోకి నెట్టారు. పవర్ ప్లేలో 41 రన్స్‌కే 3 కీలక వికెట్లు కోల్పోయిన సీఎస్కే ఏ దశలోనూ కోలుకోలేదు. ఆఖర్లో విజయ్ శంకర్(68 నాటౌట్), ఎంఎస్ ధోనీ (30 నాటౌట్)లు పోరాడినా జట్టును గెలిపించలేకపోయారు.

ఛేదన అంటే చాలు చెన్నై సూపర్ కింగ్స్ తడబడుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ సీఎస్కే చతికిలపడింది. ఢిల్లీ క్యాపిటల్స్ నిర్దేశించిన 184 పరుగుల ఛేదనలో టాపార్డర్ వైఫల్యంతో ఓటమి అంచుల్లోకి వెళ్లింది. తొలి ఓవర్లోనే రిటర్న్ క్యాచ్‌తో రచిన్ రవీంద్ర(3)ను వెనక్కి పంపాడు. ఆ షాక్ నుంచి తేరుకునేలోపే డెవాన్ కాన్వే(13)ను విప్రజ్ నిగమ్ బోల్తా కొట్టించాడు.

ఆ కాసేపటికే మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(5) పెద్ద షాట్ ఆడగా.. బౌండరీ లైన్ వద్ద క్యాచ్ అందుకున్నాడు. దాంతో, 41 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఆపద్బాంధవుడు శివం దూబే(18), రవీంద్ర జడేజా(2)లు ఘోరంగా విఫలమయ్యారు. దూబే ఔట్ అయ్యాక.. విజయ్ శంకర్(68 నాటౌట్) అండగా ఎంఎస్ ధోనీ(30 నాటౌట్) చివరివరకూ పోరాడాడు. ఆరో వికెట్‌కు 84 పరుగులు జోడించినా ఓటమి తప్పించలేకపోయారు.

**రాహుల్ మెరుపులతో..**

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకన్న ఢిల్లీకి సీఎస్కే పేసర్ ఖలీల్ అహ్మద్ ఆదిలోనే షాకిచ్చాడు. డేంజరస్ ఓపెనర్ ఫ్రేజర్ మెక్‌గుర్క్(0)ను డకౌట్‌గా వెనక్కి పంపాడు. సున్నాకే వికెట్ పడిన వేళ కేఎల్ రాహుల్(77), అభిషేక్ పొరెల్(33)లు దూకుడుగా ఆడి సీఎస్కేపై ఒత్తిడి పెంచారు. రవీంద్ర జడేజా బౌలింగ్‌లో పొరెల్ వెనుదిరగడంతో 54 పరుగుల వద్ద ఢిల్లీ రెండో వికెట్ కోల్పోయింది. అనంతరం క్రీజులోకి వచ్చిన కెప్టెన్ అక్షర్ పటేల్(21) ధాటిగా ఆడే ప్రయత్నం చేశాడు. అశ్విన్ బౌలింగ్‌లో స్ట్రెయిట్‌గా భారీ సిక్సర్ బాదిన అతడు.. నూర్ అహ్మద్ బౌలింగ్‌ను అంచనా వేయలేక క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దాంతో, 90 వద్ద ఢిల్లీ మూడో వికెట్ పడింది.

**కేఎల్ రాహుల్(77)**

అక్షర్ పటేల్ వెనుదిరిగాక కేఎల్ రాహుల్ గేర్ మార్చాడు. చెన్నై స్పిన్నర్లపై ఎదురుదాడికి దిగి బౌండరీలతో చెపాక్‌ను హోరెత్తించాడు. 33 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకన్న రాహుల్ ఆ తర్వాత మరింత దూకుడుగా ఆడాడు. సమీర్ రిజ్వీతో కలిసి నాలుగో వికెట్‌కు 56 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. డిల్లీ స్కోర్ బోర్డును ఉరికిస్తున్న ఈ జోడీని ఖలీల్ విడదీశాడు. ఆ తర్వాత ఎంట్రీ ఇచ్చిన ట్రిస్టన్ స్టబ్స్(21) రెండు ఫోర్లు, ఒక సిక్సర్‌తో జట్టు స్కోర్ 180 దాటించాడు. పథిరన వేసిన 20వ ఓవర్లో రాహుల్, ఫినిషర్ అశుతోష్ శర్మ(1)లు ఔట్ కావడంతో ఢిల్లీ 183 పరుగులకే పరిమితమైంది.

## భారత్‌తో సిరీస్‌కు స్టోన్ దూరం!



భారత్‌తో కీలకమైన టెస్టు సిరీస్‌కు ముందు ఇంగ్లండ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. మోకాలి గాయం కారణంగా యువ పేసర్ ఒలీ స్టోన్.. టీమ్ఇండియాతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌కు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అబుదాబిలో జరిగిన కౌంటీ ప్రి సీజన్ కోసం సిద్ధమవుతున్న స్టోన్ గాయం కారణంగా తప్పుకోవాల్సి వచ్చిందని ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఈసీబీ) శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. గాయం తీవ్రత తెలియాల్సి ఉందని, స్కానింగ్ పరీక్షల తర్వాత ఒక అంచనాకు వస్తామని ఈసీబీ తెలిపింది. పూర్తిగా కోలుకునేందుకు దాదాపు 14 వారాల సమయం పట్టే అవకాశమున్నట్లు ఇంగ్లండ్ క్రికెట్ వర్గాలు స్పష్టం చేశాయి. జూన్ 20 నుంచి హెడింగ్లే వేదికగా భారత్, ఇంగ్లండ్ మధ్య తొలి టెస్టు మొదలుకానుంది.

## టైటిల్ పోరుకు హితేశ్

దిల్లీ: బ్రెజిల్‌లో జరుగుతున్న ప్రపంచ బాక్సింగ్ కప్‌లో భారత క్రీడాకారుడు హితేశ్ టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచాడు. 70 కేజీల విభాగంలో అతడు ఫైనల్‌కు దూసుకెళ్లాడు. గురువారం సెమీఫైనల్లో హితేశ్ 5-0తో మకాన్ ట్రార్ (ఫ్రాన్స్)ను చిత్తు చేశాడు. ఈ పోరులో ఆరంభంలో రక్షణాత్మకంగా ఆడిన హితేశ్.. తర్వాత ప్రత్యర్థిపై పిడిగుద్దులతో విరుచుకుపడ్డాడు. మూడు రౌండ్లలోనూ అదే జోరు ప్రదర్శించి ట్రార్‌ను ఓడించాడు. ఫైనల్లో ఒడెల్ కమారా (ఇంగ్లాండ్)తో హితేశ్ తలపడనున్నాడు. 50 కేజీల్లో జదుమణి సింగ్‌కు చుక్కెదురైంది. సెమీస్‌లో అతడు 2-3తో ఆసియా అండర్-22 ఛాంపియన్ అసిల్‌బెక్ (ఉజ్బెకిస్థాన్) చేతిలో ఓడిపోయాడు. విశాల్ (90 కేజీ), సచిన్ (60 కేజీ) కూడా ఇంటిముఖం పట్టారు. టురాబెక్ (ఉజ్బెకిస్థాన్) చేతిలో విశాల్ 0-5తో ఓడగా.. పావెల్ బ్రాచ్ (పోలెండ్) చేతిలో సచిన్ అంతే తేడాతో పరాజయం పాలయ్యాడు.



## షూటింగ్ ప్రపంచకప్.. చైన్‌సింగ్‌కు కాంస్యం

ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత షూటర్ చైన్ సింగ్ మెరిశాడు. అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిర్స్‌లో జరుగుతున్న పోటీల్లో అతను 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో కాంస్యం సాధించాడు. చైన్ సింగ్ 443.7 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. ఇస్త్వాన్ పెని (హంగేరీ-461), టియాన్ జైమింగ్ (చైనా-458.8) వరుసగా స్వర్ణం, రజతం గెలిచారు. 25 మీటర్ల పిస్టల్ విభాగంలో మను బాకర్, సిమ్రన్‌జీత్ కౌర్ ఫైనల్‌కు అర్హత సాధించారు.



## తిలక్ వర్మ 'రిటైర్డ్ ఔట్' నిర్ణయం సూర్యకుమార్‌కు నచ్చలేదా?

భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో తిలక్ వర్మ అద్భుతంగా ఆడాడు. తిలక్ కోసం మూడో స్థానాన్ని కూడా త్యాగం చేశాడు. దీంతో ప్రపంచంలోనే నంబర్ - 2 ర్యాంక్‌కు చేరాడు. ఐపీఎల్‌లోనూ ముంబయి ఇండియన్స్ తరఫున కీలక ఇన్నింగ్స్ ఆడిన క్రికెటర్. కానీ, లఖ్‌నవూతో జరిగిన మ్యాచ్‌లో మాత్రం అతడిని 'రిటైర్డ్ ఔట్'గా ప్రకటించడం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఈ నిర్ణయంపై ఇప్పటికే కెప్టెన్ హార్దిక్ పాండ్య వివరణ ఇచ్చాడు. కానీ, సూర్యకుమార్ యాదవ్‌కు మాత్రం ఆ నిర్ణయం నచ్చలేదని అతడి రియాక్షన్‌ను బట్టి తెలుస్తోంది. అయితే, జయవర్ధనె వెళ్లి సూర్యకు నచ్చజెబుతూ ఉన్న వీడియోలు వైరల్‌గా మారాయి. ఈ మ్యాచ్‌లో సూర్యకుమార్ హాఫ్ సెంచరీ సాధించిన సంగతి తెలిసిందే. తిలక్




వర్మ 23 బంతుల్లో 25 పరుగులు మాత్రమే చేశాడు. అతడికి బదులు మిచెల్ సాంట్నర్‌ను ఆడించినా ముంబయికి ఓటమి మాత్రం తప్పలేదు.

**కోచ్ వివరణ ఇదీ..**

తిలక్ వర్మ ఎపిసోడ్‌పై ముంబయి కోచ్ జయవర్ధనె కూడా స్పందించాడు. ఇలాంటి నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలను వెల్లడించాడు. "తిలక్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఈ మ్యాచ్‌లోనూ సూర్యతో కలిసి మంచి భాగస్వామ్యం నిర్మించాడు. దూకుడు పెంచాలని చూసినా కుదరలేదు. కొన్ని ఓవర్ల వరకూ వేచి చూశాడు. హిట్టింగ్ చేసేందుకు ప్రయత్నించినా సఫలం కాలేదు. దీంతో అతడిని అక్కడికి ఆపి కొత్తగా ఎవరినైనా పంపించాలని నిర్ణయించాం. ఎందుకంటే ఇబ్బందిపడుతూ ఉన్నప్పుడు ఒత్తిడి పెంచకూడదు. క్రికెట్‌లో ఇవన్నీ సహజంగానే జరుగుతుంటాయి. అతడిని ఔట్‌గా ప్రకటించడం నాకూ ఇష్టం లేదు. జట్టు వ్యూహంలో భాగంగా చేయాల్సి వచ్చింది" అని జయవర్ధనె వెల్లడించాడు.

" హార్దిక్ పాండ్య బౌలింగ్ బాగుంది. ఎక్కడ స్లో బంతులు వేయాలి. ఎలాంటప్పుడు లెంగ్త్‌తో సంధించాలనేది తెలుసు. పవర్‌ప్లేలో మేం అదనంగా పరుగులు ఇచ్చాం. బంతిని వేగంగా వేసేందుకు ప్రయత్నించడం వల్లే ఇలా జరిగింది. పాండ్య తన అనుభవంతో బౌలింగ్ చేశాడు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఫలితం రాబట్టాడు. అతడి వల్ల లఖ్‌నవూ భారీ స్కోరు చేయకుండా అడ్డుకోగలిగాం" అని కోచ్ తెలిపాడు.

## పంత్‌కు రూ.12 లక్షలు.. దిగ్వేశ్‌కు భారీ జరిమానా!

ముంబయి ఇండియన్స్‌ను చిత్తు చేసిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కు షాక్ తగిలింది. ఎల్ఎస్‌జీ కెప్టెన్ రిషభ్ పంత్‌తోపాటు యువ స్పిన్నర్ దిగ్వేశ్ రాఠికి జరిమానా విధిస్తూ ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ నిర్ణయం తీసుకుంది. లఖ్‌నవూలోని అటల్ బిహారీ వాజ్‌పేయీ ఏకనా స్టేడియం వేదికగా మ్యాచ్ జరిగింది. పంత్‌కు రూ.12 లక్షలు జరిమానా విధించగా.. యువ బౌలర్ దిగ్వేశ్ వరుసగా రెండోసారి ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ ఆగ్రహానికి గురికావడం గమనార్హం. "లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ సారథి రిషభ్ పంత్ కు జరిమానా విధించాం. స్లో ఓవర్ రేట్ కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నాం. ఆర్టికల్ 2.22 ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం పంత్‌కు రూ. 12 లక్షలు జరిమానా విధించాం" అని ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ తెలిపింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో 'స్లో ఓవర్ రేట్' కారణంగా జరిమానా ఎదుర్కొన్న మూడో సారథి రిషభ్ పంత్. ఇంతకుముందు హార్దిక్ పాండ్య, రియాన్ పరాగ్‌పై ఫైన్ పడింది. ముంబయిపై లఖ్‌నవూ విజయం సాధించడంలో దిగ్వేశ్ రాఠి కీలక పాత్ర పోషించాడు. నాలుగు ఓవర్ల స్పెల్‌లో ఒక్క వికెట్ తీసి 21 పరుగులు మాత్రమే ఇచ్చాడు.



## ‘తుంబాడ్’ దర్శకుడితో శ్రద్ధ?



గతేడాది ‘స్త్రీ 2’ చిత్రంతో బాలీవుడ్ బాక్సాఫీసు వద్ద రికార్డు సృష్టించింది కథానాయిక శ్రద్ధా కపూర్. ఈ సినిమా విజయంతో ప్రస్తుతం ఆమెకు అవకాశాలు వరుస కడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే శ్రద్ధ మరో హారర్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ‘తుంబాడ్’తో మంచి గుర్తింపు తెచ్చుకున్న రాహి అనిల్ బార్వే తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. “కొన్ని రోజులుగా శ్రద్ధ నిర్మాత ఏక్తాకపూర్‌తో తన రాబోయే చిత్రం కోసం చర్చలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే అనిల్ బార్వే చెప్పిన కథకు పచ్చజెండా ఊపిందామె. ఇంకా పేరు ఖరారు కానీ ఈ చిత్రాన్ని ‘స్త్రీ’ చిత్రాల కన్నా భారీ స్థాయిలో తీర్చిదిద్దుతున్నారు. ఈ ఏడాది ద్వితీయార్ధంలో దీన్ని పట్టాలెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నార”ని శ్రద్ధ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

## రాజమౌళి ట్వీట్‌తో గుర్తింపు వచ్చింది



“హృదయ కాలేయం’ చిత్ర విడుదల సమయంలో దర్శకుడు రాజమౌళి చేసిన ట్వీట్ వల్ల నాకెంతో గుర్తింపు దక్కింద”న్నారు నటుడు సంపూర్ణేశ్ బాబు. భవిష్యత్తులో ఆయన చిత్రంలో నటించే అవకాశం వస్తే అంతకంటే కావాల్సిందేమీ లేదన్నారు. సంపూర్ణేశ్ బాబు హీరోగా నటించిన తొలి చిత్రం ‘హృదయ కాలేయం’ విడుదలై 11ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. “నరసింహాచారిగా చిన్న పల్లెటూరి నుంచి వచ్చిన నన్ను ‘హృదయ కాలేయం’ సినిమాతో సంపూర్ణేశ్ బాబుగా మార్చారు దర్శకుడు సాయి రాజేశ్. దానికి ఆ అన్నకి ఎప్పటికీ రుణపడి ఉంటా. కనీసం కారులోనైనా తిరగగలనా అనుకున్న నన్ను ఈ చిత్రం .. సాయి రాజేశ్ ఇచ్చిన అవకాశం విమానాల్లో తిరగగలిగేలా చేసింది. ఈ సినిమా విడుదలై 11ఏళ్లయినా ఇప్పటికీ ప్రేక్షకులు దాని గురించి మాట్లాడుకోవడం ఆనందంగా ఉంది” అన్నారు.

**‘సోదరా’లాంటి కుటుంబ కథల్ని ప్రేక్షకులకు అందించాలి**

“సోదరా’లాంటి కుటుంబ కథలు.. అన్నదమ్ముల విలువల గురించి చెప్పే చిత్రాలు తెలుగు ప్రేక్షకులకు కచ్చితంగా అందించాల”న్నారు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. సంపూర్ణేశ్‌బాబు, సంజోశ్ హీరోలుగా మోహన్ మేనంపల్లి తెరకెక్కించిన చిత్రమే ‘సోదరా’. ఇది ఈ నెల 25న విడుదల కానున్న నేపథ్యంలో చిత్రబృందం ఇటీవల తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌ను గౌరవప్రదంగా కలిసింది. ఆయనకు చిత్ర విశేషాలు తెలియజేసి.. సినిమా తప్పక చూడాలని విన్నవించుకున్నారు.

## ఎన్టీఆర్‌పై బాలీవుడ్ హీరో ఆసక్తికర వ్యాఖ్యలు

టాలీవుడ్ హీరో ఎన్టీఆర్‌పై బాలీవుడ్ అగ్ర కథానాయకుడు హృతిక్ రోషన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వీరిద్దరూ కలిసి ‘వార్ 2’లో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఓ ఈవెంట్‌లో పాల్గొన్న ఆయన ఈ సినిమా ఆగస్టు 14న విడుదల అవుతుందని మరోసారి స్పష్టం చేశారు.

తారక్ గురించి హృతిక్ మాట్లాడుతూ.. “ఒక పాట మినహా ‘వార్2’ షూటింగ్ అంతా పూర్తయ్యింది. నాకు ఇష్టమైన సహనటుడు ఎన్టీఆర్. గొప్ప నటుడు. మంచి టీమ్‌మేట్. మా సినిమా అద్భుతంగా వచ్చింది. ఆగస్టు 14న థియేటర్‌లలోకి రానుంది . దీనికోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నా” అని చెప్పారు. దీంతో ఆ వేదికంతా కేరింతలతో మారుమోగింది. ఈ హీరో మాటలతో సినిమా విడుదలపై కూడా మరోసారి స్పష్టత వచ్చింది.

హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా తెరకెక్కిన చిత్రం ‘వార్’. ఈ స్పై థ్రిల్లర్ సూపర్ సక్సెస్ సాధించి బాక్సాఫీసు వద్ద భారీ వసూళ్లు రాబట్టింది. దీనికి సీక్వెల్‌గా తెరకెక్కుతున్న చిత్రమే ‘వార్2’ ). ఈ సినిమాలో ఎన్టీఆర్ రా ఏజెంట్‌గా నటించనున్నట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. గతంలో సల్మాన్‌ఖాన్, హృతిక్ రోషన్, షారుక్‌ఖాన్‌లు ఏజెంట్ పాత్రలో నటించి మంచి విజయాన్ని అందుకున్నారు. వీటన్నింటికంటే భిన్నంగా ఎన్టీఆర్ పాత్ర ఉండనుంది. భారీ యాక్షన్ చిత్రంగా యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థపై అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఇది రానుంది.




## ఓమన్‌లో పుట్టిన రోజు వేడుకలు



కన్నడ భామ రష్మిక మందన్న వరుస విజయాలతో తారాపథంలో దూసుకుపోతున్నది. ‘పుష్ప’ ఫ్రాంఛైజీ, యానిమల్, ఛావా చిత్రాలు ఆమెకు దేశవ్యాప్తంగా తిరుగులేని పాపులారిటీని తెచ్చిపెట్టాయి. ఓ దక్షిణాది కథానాయిక అనతికాలంలోనే ఈ స్థాయి పేరుప్రఖ్యాతులు దక్కించుకోవడం అరుదైన విషమయని ఇండస్ట్రీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇదిలావుండగా నేడు రష్మిక మందన్న జన్మదినం. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, సన్నిహితులతో కలిసి గ్రాండ్‌గా సెలబ్రేషన్స్‌కు సిద్ధమవుతున్నదీ భామ. అందుకు ఓమన్ దేశం వేదిక కానుంది. బిజీ షూటింగ్ షెడ్యూల్స్ నుంచి బ్రేక్ తీసుకున్న రష్మిక మందన్న ఇప్పటికే తన మిత్రబృందంతో కలిసి ఓమన్‌కు చేరుకుంది. ఫ్యామిలీ మెంబర్స్, కొద్ది మంది సన్నిహితుల సమక్షంలో రష్మిక బర్త్‌డే సెలబ్రేట్ చేసుకోనుందని తెలిసింది. ఇటీవల విడుదలైన ‘ఛావా’ చిత్రం అపూర్వ విజయంతో ద్విగుణీకృతమైన ఆనందంతో ఉంది రష్మిక మందన్న. దాంతో ఈ ఏడాది బర్త్‌డే చాలా ప్రత్యేకమైనదిగా భావిస్తున్నదట. ప్రస్తుతం రష్మిక తెలుగులో కుబేర, గర్ల్‌ఫ్రెండ్ చిత్రాల్లో నటిస్తున్నది.

## ఆ పనికిమాలిన ట్రోఫీల కంటే ఈ చీర విలువైంది: కంగనా రనౌత్

బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘ఎమర్జెన్సీ’. ఎన్నో అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం చివరకు మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. బాక్సాఫీస్ కలెక్షన్స్‌ను పక్కనపెట్టి తమ చిత్రానికి ప్రేక్షకుల ప్రశంసలు దక్కాయని కంగన తరచూ చెబుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఆమె తమ చిత్రాన్ని ప్రశంసిస్తూ ఒక వ్యక్తి రాసిన లేఖను ఇన్‌స్టా వేదికగా షేర్ చేశారు. అతడు పంపిన బహుమతి తనకెంతో విలువైందన్నారు.భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవితాన్ని ఆధారంగా చేసుకొని రూపొందిన చిత్రం ‘ఎమర్జెన్సీ’. ఎమర్జెన్సీ నాటి పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపించారు. ఎన్నో వివాదాలు ఎదుర్కొని ఎట్టకేలకు జనవరి 17న ఇది థియేటర్లలో విడుదలైంది. దీనిపై పలువురు భిన్న అభిప్రాయాలు వ్యక్తంచేశారు. ప్రస్తుతం ఓటీటీ వేదికగా అందుబాటులో ఉన్న ఈ చిత్రంపై నిత్యానందం అనే వ్యక్తి ప్రశంసల వర్షం కురిపించాడు. ఇలాంటి పవర్‌ఫుల్ సబ్జెక్ట్‌ను ఎలాంటి బెరుకు లేకుండా రూపొందించిన కంగనను మెచ్చుకున్నాడు. ఆమెకు బహుమతిగా ఒక కాంచీవరం చీరను పంపినట్లు పేర్కొన్నాడు. అతడు రాసిన లేఖను ఇన్‌స్టా వేదికగా షేర్ చేసిన కంగన.. ఆ బహుమతి తనకు ఎంతో విలువైందన్నారు. “ఎమర్జెన్సీ’ని రూపొందించినందుకు నేనొక అద్భుతమైన చీరను పొందాను. పనికిమాలిన ఆ ట్రోఫీల కంటే ఈ చీర ఎంతో ఉత్తమమైనది” అని రాసుకొచ్చారు. బాలీవుడ్‌లో నిర్వహించే అవార్డుల కార్యక్రమాలను ఉద్దేశించి కంగన ఈవిధమైన వ్యాఖ్యలు చేయడం ఇదేం తొలిసారి కాదు. గతంలోనూ ఆమె ఇదేతరహా వ్యాఖ్యలు చేశారు. అర్హులకు అవార్డులు ఇవ్వరని ఆమె ఇప్పటికే పలు సందర్భాల్లో విమర్శించారు. అవార్డుల కార్యక్రమాల్లోనూ బంధుప్రీతికే (నెపోటిజం) మొగ్గు చూపుతారని ఆమె అన్నారు.




## హీరోయిన్స్‌ను ఒకేతరహా పాత్రలకే పరిమితం చేస్తారు: పూజా హెగ్డే



ప్రస్తుతం వరుణ్ ధావన్‌తో కలిసి ‘హై జవానీ తో ఇష్క్ హోనా హై’ లో నటిస్తున్నారు పూజా హెగ్డే . తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన పూజా తాను ఎన్ని సినిమాలు చేసినప్పటికీ ఆడిషన్ ఇవ్వడానికి సిద్ధంగా ఉంటానని చెప్పారు. పరిశ్రమలో హీరోయిన్స్‌కు ఎప్పుడూ ఒకేలాంటి పాత్రలు ఇస్తున్నారని అన్నారు.“దర్శక నిర్మాతలు నటీనటులపై ఒక అభిప్రాయానికి వస్తారు. వీరు ఈ పాత్రలకు సరిపోతారన్న భావనకు వస్తారు. ముఖ్యంగా హీరోయిన్స్ గురించి ఎప్పుడూ ఒకేలా ఆలోచిస్తారు. ఒకే తరహా పాత్రలకు పరిమితం చేస్తారు. ఏదైనా పాత్రను రాసినప్పుడు దానికి వారు అనుకున్న నటి సరిపోతారనుకుంటారు. ఆమెతో పాత్రకు కావాల్సిన ఆడిషన్ చేయరు. నా దృష్టిలో ప్రతి సినిమాకు ఆడిషన్ ముఖ్యం. కొన్ని ఇండస్ట్రీల్లోనే ఇలాంటి పరిస్థితి ఉంది. కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఇటీవల నేను ఓ తమిళ సినిమా కోసం ఆడిషన్‌కు వెళ్లాను. కానీ ఆ పాత్రకు నా వయసు చాలా చిన్నదని భావించి తిరస్కరించారు. నా కంటే పెద్ద నటిని తీసుకున్నారు. సినిమాను అంగీకరించిన తర్వాత పాత్రకు సరిపోలేదని తిరస్కరించే బదులు.. ముందే ఆడిషన్ చేయడం ముఖ్యం ” అని చెప్పారు.ఇక సినిమాల విషయానికొస్తే.. పూజా ప్రస్తుతం ‘రెట్రో’లో నటిస్తున్నారు. సూర్య హీరోగా కార్తిక్ సుబ్బరాజు తెరకెక్కిస్తున్న చిత్రమిది. మే1న ప్రేక్షకుల ముందుకురానుంది.

## ‘కూలీ’ విడుదల ఖరారు

‘కూలీ’ చిత్రంతో సినీప్రియుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు రజనీకాంత్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని లోకేశ్ కనగరాజ్ తెరకెక్కిస్తున్నారు. కళానిధి మారన్ నిర్మాత. నాగార్జున, ఆమిర్‌ఖాన్, ఉపేంద్ర, శ్రుతిహాసన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ విషయాన్ని చిత్ర బృందం శుక్రవారం ప్రకటించింది. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను నెట్టింట పంచుకుంది. అందులో రజనీ మాస్‌లుక్‌లో విజిల్ వేస్తూ కనిపించారు.



బంగారం స్మగ్లింగ్ అంశంతో ముడిపడి ఉన్న యాక్షన్ థ్రిల్లర్ ఇది. రజనీ మునుపెన్నడూ చేయని శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నారు. ఇందులో పూజా హెగ్డే ఓ ప్రత్యేక గీతంలో ఆడిపాడింది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

Editor, Printed And Published Owned By Ediga Nagaraju, H.No: 84/188-A, Near YSR Statue, Shareen Nagar, Kalluru Mandal, Kurnool Dist. Printed At Maa Janani Publications, H.No: 84/119-2, Shareen Nagar, Kalluru Mandal, Kurnool Dist, Pin: 518 002, RNI No: AP Tel/2019/77777, email address: hamsavoice@gmail.com. Contact No: +91 9949246060